www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

మంగళవారం 30 డిసెంబర్ 2025


సంగారెడ్డి  సంచిక : 176  సంపుటి : 1  పేజీలు : 8  వెల : రూ. 5/-

## రూ. 1.6 లక్షల కోట్ల నిధులు తీసుకెళ్లిన ఎఫ్‌పీఐలు

విదేశీ ఇన్వెస్టర్లు ఈ ఏడాది భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి రికార్డు స్థాయిలో నిధులు ఉపసంహరించుకున్నారు. భారత కరెన్సీ రూపాయితో పాటు ఇతర కరెన్సీలూ అస్థిరం గా ఉండటం, ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు, ముఖ్యంగా అమెరికా విధించిన అధిక సుంకాలు, అధిక వాల్యుయేషన్ల కారణంగా మదుపర్లు రిస్క్‌ను తగ్గించుకోవడంతో రికార్డు స్థాయిలో రూ. 1.6 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇదే సమయంలో అమెరికా మార్కెట్ల నుంచి ఎక్కువ రాబడి ఉండటంతో నిధులను తరలించారు. కొందరు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) స్టాక్ మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్న నిధులను బాండ్లు వంటి సురక్షితమైన సాధనాల్లో పెట్టుబడిగా



# వారం రోజులు పాటు యుద్ధమే



రెండు గంటలు సాగిన శాసనసభ

- జనవరి 2 నుంచి 7వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
- స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం
- 15 రోజులు సమావేశాలు జరపాలని పట్టుపట్టాం
- 32 అంశాలపై చర్చించాలని కోరాం : బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- రేపట్నుంచి జనవరి 1 వరకు సమావేశాలకు విరామం

హైదరాబాద్

శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఇటీవల మరణించిన దివంగత మాజీ ఎమ్మెల్యే, మండలి సభ్యులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం పలు ఆర్డినెన్స్‌లను ఉభయసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్‌ను కొనసాగించగా పలువురు సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. బీఏసీలో శాసనసభ సమావేశాలు జనవరి 2 నుంచి 7 వరకు జరపాలని నిర్ణయించారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తొలిరోజున దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాపం తెలిపింది. అనంతరం స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. శాసన మండలిలో మాజీ ఎమ్మెల్సీలు మాధవరం - మిగతా3లో

# ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టాలి



- బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి
- వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేసిన సర్కార్
- ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ అస్త్రశస్త్రాలు
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సహా, నదీజలాల అంశంపై శాసనసభా వేదికగా బీఆర్ఎస్‌ను ఎండగట్టేందుకు సీఎం ఆదేశాలు
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించిన రేవంత్‌రెడ్డి
- జూరాల నుంచి అయితే తక్కువ ఎత్తుకే ఎత్తిపోయవచ్చు

హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. విపక్షాల విమర్శలను తిప్పికొట్టే వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేసింది. కృష్ణా, గోదావరి నీటి వాటాల పంపిణీపై దీటుగా సమాధానమిచ్చేందుకు సన్నద్ధమైంది. రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ విస్తరణ తదితర అంశాలపై చర్చకు సమాయత్తమవుతోంది. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టేందుకు అధికార కాంగ్రెస్ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సహా, నదీజలాల అంశంపై శాసనసభ వేదికగా బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేలా సమగ్ర సమాచారాన్ని - మిగతా3లో



## అరావళి'పై 'సుప్రీం' స్టే పాత ఉత్తర్వుల నిలిపివేత

- గత నవంబర్ 20న సుప్రీంకోర్టు.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సూచించిన నిర్వచనాన్ని ఆమోదించింది.
- స్థానిక భూతలానికి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలనే అరావళి శ్రేణిగా గుర్తించాలి
- కేవలం ఎత్తును ప్రాతిపదికగా తీసుకుంటే, దాదాపు 90 శాతం అరావళి ప్రాంతం రక్షణ కోల్పోతుంది



## పాకిస్థాన్‌లో కొత్త టెర్రరిస్ట్ లీడర్

- హాఫీజ్, మసూద్ పనికిరారని భావిస్తున్న పాక్ ప్రభుత్వం
- ముఖాలు మార్చుకుంటున్న పాకిస్థాన్ టెర్రరిజం
- తెరపైకి కొత్త ఉగ్ర నేత యాకూబ్ షేక్
- యాకూబ్ ను 2012లోనే ఉగ్రవాదిగా గుర్తించిన అమెరికా



## సీఎం రేవంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయిన కేసీఆర్


- మూడోసారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్..
- బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలతో భేటీ
- కృష్ణా జలాల పంపిణీపై జరగనున్న శీతాకాల సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలున్నాయి.

హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. సమావేశాలకు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్.. పట్టుమని అరగంట కూడా ఉండకుండా వెళ్లిపోయారు. అయితే ఈలోపే సభలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. మూడోసారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆపై శాసన సభ ప్రారంభం అయ్యి.. జాతీయ గీతం ఆలాపన దాకా ఉన్నారు. అంతకంటే కాస్త ముందు.. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత వద్దకు వెళ్లి పలకరించారు. - మిగతా3లో

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం

- పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు
- ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోంది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



# కృష్ణానది ఎక్కడ ఉందో తెలియదు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అసెంబ్లీలో నీటి సమస్యలపై దేనిమీద చర్చపెట్టాలో సైతం కనీసం ప్రభుత్వానికి అవగాహన లేదు
- కేసీఆర్ చర్చకు వస్తున్నారని మంత్రులంతా ప్రిపరేషన్ మెదలు పెట్టారు
- బాక్రానంగల్ ప్రాజెక్ట్ ఏ రాష్ట్రంలో ఉన్న సంగతి కూడా సీఎంకు తెలియకపోవడం బాధాకరం





## మహా రాజకీయాల్లో కీలక పరిణామం..

కలిసిపోయిన పవార్ కుటుంబం.. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ

ప్రస్తుతం సీట్ల సర్దుబాటు జరుగుతోంది

త్వరలో అధికారిక ప్రకటన వస్తుంది

# కారుణ్య నియామకం హక్కు కాదు.. తక్షణ భరోసా



ప్రభుత్వ ఉద్యోగుల మరణానంతరం వారి కుటుంబ సభ్యులకు కల్పించే కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కారుణ్య నియామక ప్రాతిపదికన ఒకసారి ఉద్యోగాన్ని అంగీకరించిన తర్వాత, తమకు అర్హత ఉన్నా అంతకంటే ఉన్నత పదవి కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసింది.

**కేసు నేపథ్యం**

తమిళనాడు పట్టణ పంచాయతీల్లో స్వీపర్లుగా పనిచేస్తూ మరణించిన ఇద్దరు వేర్వేరు ఉద్యోగుల కుమారులకు (ఎం.జయబల్, ఎస్.వీరమణి) వారి తండ్రుల మరణానంతరం 2007, 2012 సంవత్సరాల్లో స్వీపర్లుగానే ఉద్యోగాలు లభించాయి. వారు ఉద్యోగంలో చేరే సమయంలో ఎలాంటి అభ్యంతరం తెలపకుండా ఆ కొలువుల్లో చేరారు. అయితే, సుమారు 3 నుంచి 9 ఏళ్ల తర్వాత తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన అర్హతలు ఉన్నాయని, అప్పట్లో అవగాహన లేక తక్కువ స్థాయి ఉద్యోగంలో చేరామని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వగా, దానిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

**సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యాంశాలు**

కారుణ్య నియామకం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు)కు ఒక మినహాయింపు మాత్రమే. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్న కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వడమే దీని ఉద్దేశం. ఇది ఒక హక్కు కాదు లేదా కెరీర్ అభివృద్ధి కోసం ఇచ్చే అవకాశం కాదు. అభ్యర్థికి ఉన్నత పదవికి కావాల్సిన విద్యార్హతలు ఉన్నప్పటికీ ఖాళీలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తదుపరి నియామకం జరుగుతుంది. అర్హత ఉంది కదా అని ఉన్నత పదవిని డిమాండ్ చేసే హక్కు అభ్యర్థికి ఉండదు. ఉద్యోగంలో చేరిన చాలా ఏళ్ల తర్వాత (3-9 ఏళ్లు) కోర్టును ఆశ్రయించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'వేరే ఒకరికి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పదవి ఇచ్చారు కాబట్టి, మాకూ ఇవ్వాలి' అనే వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఒక అధికారి చేసిన తప్పును మరొకరికి వర్తింపజేయమని కోర్టులు ఆదేశించలేవని చెప్పింది. తప్పును పునరావృతం చేయలేమని స్పష్టం చేసింది.

**న్యాయ నిపుణుల విశ్లేషణ**

ఈ తీర్పుపై న్యాయ నిపుణులు స్పందిస్తూ, ఇది ప్రభుత్వ నియామక ప్రక్రియల సమగ్రతను కాపాడుతుందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు కేవలం మానవతా దృక్పథంతో చేసేవని, వీటిని సీనియారిటీ పెంచుకోవడానికి లేదా ఉన్నత పదవులు అనుభవించడానికి వాడుకోలేమని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును కొట్టివేస్తూ, పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో కారుణ్య నియామకం పొందిన వారు భవిష్యత్తులో ఉన్నత పదవుల కోసం ఇలాంటి క్లెయిమ్స్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది.

# పాకిస్థాన్‌లో కొత్త టెర్రరిస్ట్ లీడర్



భారత్‌పై ఉగ్రదాడుల పన్నాగాలకు వేదికగా మారిన పాకిస్థాన్... పేర్లు మారుస్తూ, ముఖాలు మార్చుకుంటూ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తూనే ఉంది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులు కొంత మారినట్టు కనిపించినా, వాస్తవం మాత్రం మరోలా ఉంది. ఒకప్పుడు భారత్‌కు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులుగా ఉన్న హఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి వాళ్లు ఒక్కసారిగా వార్తల నుంచి మాయమయ్యారు. వారంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ మరో కొత్త ఉగ్ర నేతను ముందుకు తెచ్చిందన్న ఆరోపణలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వస్తున్నాయి. ఆ కొత్త ఉగ్ర నేత పేరు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్. లష్కరే తోయిబా నుంచి ఉగ్ర శిక్షణ పొందిన ఇతడు, ఇప్పుడు స్వతంత్రంగా తనకంటూ ఓ కొత్త సంస్థను నిర్మించుకున్నాడు. ఆ సంస్థ పేరు సెంట్రల్ ముస్లిం లీగ్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ సంస్థను పాకిస్థాన్‌లో ఒక రాజకీయ పార్టీగా నమోదు చేశారు. అంతే కాదు, దీనికి పాక్ సైన్యం పరోక్షంగా మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**యాకూబ్ షేక్ నేపథ్యం**

1972లో పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జన్మించిన ఖారీ యాకూబ్, మొదట మదర్సాలో చదువు పూర్తిచేసి మతప్రచారకుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. అయితే క్రమంగా తీవ్రవాద భావజాలానికి లోనై ఉగ్రవాద మార్గంలోకి మళ్లాడు. 2012లోనే అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా గుర్తించింది. అప్పట్లో అతడు లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు, జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పలు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి. 2017లో దిఫా-ఏ-పాకిస్థాన్ కౌన్సిల్ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన యాకూబ్ ఓడిపోయాడు. అయినా రాజకీయాల్ని, ఉగ్రవాదాన్ని కలిపి నడిపే ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు. 2025 ప్రారంభంలో ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో, యాకూబ్ తాలిబాన్ పాలనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశాడు. ఇదే అంశం పాక్ సైన్యానికి అతడిని దగ్గర చేసింది. అప్పటి నుంచి యాకూబ్‌కు సైన్యం అండగా నిలుస్తోందన్న ప్రచారం మొదలైంది. ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 14 మంది మరణించారు. హఫీజ్ సయీద్‌కు చెందిన రహస్య స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరూ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారు పాక్ సైన్యం నిఘాలోనే భద్రంగా ఉన్నారని సమాచారం. ఇదే సమయంలో పాకిస్థాన్ దేశంలో తెహ్రీక్-ఇ-తాలిబాన్, బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి ఉగ్రసంస్థలు సైన్యానికి పెద్ద సవాలుగా మారాయి. వీటిని అణచివేయడంలో పాక్ సైన్యం విఫలమవుతోంది. ఈ పరిస్థితుల్లోనే పాకిస్థాన్ మరోసారి పాత పద్ధతికే వెళ్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత ఉగ్రనేతలు అయిన హఫీజ్, మసూద్ ఇక పనికిరారని భావించి, వారి స్థానంలో కొత్త ముఖాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నమే ఖారీ యాకూబ్ షేక్ అని అంటున్నారు. ఉగ్రవాదాన్ని రాజకీయాల ముసుగులో దాచిపెట్టి, ప్రపంచాన్ని మభ్యపెట్టే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోందన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..



దేశ రాజధాని ఢిల్లీని ప్రమాదకరమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. అతిసమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్ర పొగమంచు నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ఫాగ్ లైట్లను ఉపయోగించాలని సూచించింది. అత్యవసర పరిస్థితి ఉంటేనే బయటకు రావాలని హెచ్చరించింది. పొగమంచు కారణంగా విజిబిలిటీ పడిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే దాదాపు 128 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. అందులో 64 అరైవల్స్ కాగా, 64 డిపార్చర్స్ ఉన్నాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు విమాన స్టేటస్‌ను చెక్‌చేసుకోవాలని సూచించింది. మరోవైపు విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. మరోవైపు.. పలు రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జనశతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇవాళ ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 402గా నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపింది. నగరంలోని 40 ఎయిర్ మానిటరింగ్ కేంద్రాల్లోని 25 కేంద్రాల్లో ఇవాళ ఉదయం 7 గంటలకు గాలి నాణ్యత సూచిక తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. వివేక్ విహార్‌లో అత్య ధికంగా

## సీజేఐ చంద్రచూడ్ అని చెప్పి డిజిటల్ అరెస్ట్.. రూ.3.71 కోట్లు కోల్పోయిన 68 ఏళ్ల మహిళ



ముంబై: ముంబైకి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలిని.. సైబర్ నేరగాళ్లు దారుణంగా మోసం చేశారు. బెదిరింపులకు పాల్పడి ఆమె అకౌంట్ నుంచి సుమారు 3.71 కోట్లు కాజేశారు. డిజిటల్ అరెస్టుకు చెందిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అని చెప్పి సైబర్ నేరగాడు ఆ మహిళను మోసం చేశాడు. సీబీఐ, పోలీసు అధికారులమని ఆమెను నమ్మించారు. అంధేరీ ఈస్ట్‌లో ఆ బాధిత మహిళ 26 ఏళ్లుగా జీవిస్తోంది. ఆగస్టులో ఆమెకు తొలిసారి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పోలీసులమని చెప్పి ఆమెతో పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత వాట్సాప్‌లో వేర్వేరు నెంబర్ల నుంచి వీడియో కాల్స్ వచ్చాయి. ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసినట్లు వీడియో కాల్‌లో ఆ బాధిత మహిళను ఓ వ్యక్తి బెదిరించాడు. ఆ అకౌంట్ ద్వారా సుమారు ఆరు కోట్ల అక్రమ లావాదేవీలు జరిగినట్లు చెప్పాడు. అయితే తనకు బ్యాంక్ అకౌంట్ లేదని ఆమె చెప్పిన తర్వాత.. ఫేక్ పోలీసు ఫిర్యాదు ఫోటోలను ఆమెకు పంపారు. సీబీఐ లోగో ఉన్న డాక్యుమెంట్లను కూడా బాధిత మహిళకు మెసేజ్ చేశారు. ఈ విషయం గురించి ఫ్యామిలీలో ఎవరికీ చెప్పవద్దు అని , ఒకవేళ చెబితే వాళ్లను అరెస్టు చేస్తామని బెదిరించారు. 24 గంటల నిఘాలో ఉన్నట్లు ఆమెను బెదిరించారు. కేసు విచారణ చేపడుతున్నామన్నారు. ఇక ఆ తర్వాత ఓ వ్యక్తి వీడియో కాల్‌లో వచ్చి, తాను జడ్జి చంద్రచూడ్ అని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళను ప్రశ్నించాడు. బెయిల్ నిరాకరిస్తున్నట్లు ఆమెను బెదిరించాడు. దీంతో తన వద్ద ఉన్న డబ్బును డిపాజిట్ చేయాలని సైబర్ నేరగాళ్లు ఆమెను బెదిరించారు. మ్యూచువల్ ఫండ్స్ తీసి ఆ డబ్బును ఆర్టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆదేశించారు. పోలీసుల తనపై చర్య తీసుకునే అవకాశం ఉందన్న భయంతో.. ఆమె సుమారు 3.71 కోట్ల డబ్బును బదిలీ చేసింది. మళ్లీ మళ్లీ డబ్బులు అడగడంతో ఆమె తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. చాటింగ్ లాగ్, కాల్ డిటేల్స్, ట్రాన్‌జాక్షన్ రికార్డులు, బ్యాంక్ స్టేట్మెంట్లలను ఆమె పోలీసులకు సమర్పించింది.

## అరావళి'పై 'సుప్రీం' స్టే: పాత ఉత్తర్వుల నిలిపివేత



**న్యూఢిల్లీ:** అరావళి పర్వత శ్రేణుల నిర్వచనాన్ని పరిమితం చేస్తూ, గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై సోమవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. సముద్ర మట్టం నుండి కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న భూభాగాలను మాత్రమే అరావళి పర్వతాలుగా పరిగణించాలంటూ, ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు కోర్టు మొగ్గు చూపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి, తన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ, కీలక నిర్ణయం తీసుకుంది. గత నవంబర్ 20న సుప్రీంకోర్టు.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సూచించిన నిర్వచనాన్ని ఆమోదించింది. దీని ప్రకారం స్థానిక భూతలానికి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలనే అరావళి శ్రేణిగా గుర్తించాలని పేర్కొంది. అయితే ఈ నిర్ణయంపై పర్యావరణ వేత్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం ఎత్తును ప్రాతిపదికగా తీసుకుంటే, దాదాపు 90 శాతం అరావళి ప్రాంతం రక్షణ కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారుతుందని వారు పేర్కొన్నారు. ఈ వివాదాస్పద నిర్వచనంపై పలు విమర్శలు వచ్చిన దరిమిలా సుప్రీంకోర్టు ఈ అంశాన్ని తిరిగి విచారించాలని నిర్ణయించింది. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా అరావళి పర్వతాలు ఒక రక్షణ కవచం మాదిరిగా ఉపకరిస్తున్నాయని, దేశంలోని అత్యంత పురాతన పర్వత శ్రేణులైన వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని కోర్టు పేర్కొంది. కాగా గతంలో సర్వే ఆఫ్ ఇండియా సహాయంతో మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. అయితే తాజా స్టే ఆర్డర్ నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. సోమవారం జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం 'ఆరావళి'పై విచారణ జరిపింది.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం



బంగ్లాదేశ్ చొరబాటుదారులు అస్సాంలోనే కాకుండా.. దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అస్సాంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ.. పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. అస్సాంలో కాంగ్రెస్ ఎన్నోఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అమిత్ షా (టూఎక్ రాష్ట్రుప్త) అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపైనా దృష్టి పెట్టారన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో పాగా వేసిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి భాజపాకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. గత 11 ఏళ్లలో భాజపా ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకుందన్నారు.

## మహా రాజకీయాల్లో కీలక పరిణామం..



మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండేండ్ల క్రితం విడిపోయిన 'పవార్' కుటుంబం స్థానిక ఎన్నికల వేళ కలిసిపోయింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ శరద్ పవార్ ఒక్కటయ్యారు. త్వరలో జరగబోయే పింప్రి-చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్‌సీపీ (ఎస్పీ)-ఎన్‌సీపీ కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. 'పవార్ పరివార్ (కుటుంబం) మళ్లీ కలిసింది' అని ప్రకటించారు. జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సీట్ల సర్దుబాటు జరుగుతోందని తెలిపారు. త్వరలో అధికారిక ప్రకటన వస్తుందని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంపై దృష్టిపెట్టాలని సూచించారు. కాగా, ఇప్పటికే ఠాక్రే సోదరులు కలిసిపోయిన విషయం తెలిసిందే. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఠాక్రే సోదరులు ఏకమయ్యారు. విభేదాలతో విడిపోయిన శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే బుధవారం ఒకే వేదికపై కన్పించారు. వచ్చే నెలలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరూ కలిసి పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు పవార్ ఫ్యామిలీ కూడా ఒక్కటి కావడంతో మహా రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి.

# వారం రోజులు పాటు యుద్ధమే

-మొదటిపేజీ తరువాయి

జగపతిరావు, అహ్మద్ పీర్ షబ్బీర్‌లకు సంతాపం ప్రకటించారు. అనంతరం బీఎస్టీ సవరణల ఆర్డినెన్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మొదటి, రెండో సవరణల ఆర్డినెన్స్‌లు, పురపాలక సంఘాల సవరణల ఆర్డినెన్స్, తెలంగాణ సమగ్ర శిక్షా ఆడిట్ నివేదిక, పీఎం స్కూల్ రైజింగ్ ఇండియా ఆడిట్ రిపోర్ట్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణల ఆర్డినెన్స్‌లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణల ఆర్డినెన్స్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఉభయసభల్లో ప్రవేశ పెట్టారు. ఆయా ఆర్డినెన్స్‌ల ద్వారా తెచ్చిన సవరణలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రస్తుత సమావేశాల్లో బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు చెందిన సభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు రెండు గంటలు శాసనసభ సాగింది.

**బీఏసీ సమావేశం**

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు హాజరయ్యారు. మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ పనిదినాలు ఎజెండాను ఈ సమావేశంలో ఖరారు చేశారు.

**15 రోజులు సమావేశాలు జరపాలని పట్టుపట్టాం**

బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుపట్టామని వివరించారు. వారం రోజులు జరిపి మళ్లీ బీఏసీ పెడతామన్న స్పీకర్ చెప్పారన్న హరీశ్‌రావు అసెంబ్లీలో పీపీటీ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆలోచించి నిర్ణయం



తీసుకుంటారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించామని భట్టి విక్రమార్క అన్నారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు మీరు(కాంగ్రెస్ ప్రభుత్వం) ఇవ్వకపోతే మేము బాయ్‌కాట్ చేయాలా అని అడిగామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరాం : బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు కనీసం 20 రోజులైనా నిర్వహించాలని కోరామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరినట్లుగా వివరించారు. జనవరి 2 నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని వివరించారు. జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు. 2 రోజులు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకోవటం సరికాదని వివరించారు.

"రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంది. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం లేనటువంటి ప్రభుత్వం, మళ్లీ యథావిధిగా మూడు నాలుగు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగించేవిధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం, అనేక అంశాలపై దర్యాప్తు చేయించి బాధ్యులను జైల్లో పెడతానని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారు. ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుమీద అనేక హామీలు ఇచ్చారు. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నిస్తున్నా. ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంతో మ్యాచ్‌ఫిక్సింగ్‌కు ప్రయత్నిస్తోంది. అసెంబ్లీలో అన్ని అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం"-ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ నేత

నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ : శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభ శీతాకాల సమావేశాలు ఇరవై రోజులు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్టు చెప్పారు. చివరకు స్పీకర్ ఏడు రోజులు సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బీఏసీ భేటీకి ముందు స్పీకర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నీటిపారుదలకు సంబంధించిన అంశాలపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం కల్పించినప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఇవ్వాలని కోరారు.

# ఫస్ట్ నుంచి నూమాయిష్...

**హైదరాబాద్ :** బాగ్యనగర సంస్కృతికి నిదర్శనమైన నాంపల్లి నుమాయిష్ 85వ ఎడిషన్ జనవరి 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. దేశవిదేశాలకు చెందిన సుమారు 2,000 స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశ రుసుము రూ. 50 కాగా.. ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితం. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్, మెట్రో రాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు 82 ఫైర్ పాయింట్లు, ప్రత్యేక నిఘా టవర్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సంస్కృతిలో విడదీయలేని భాగమైన ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్) మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రదర్శన గురించి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం కీలక వివరాలను వెల్లడించారు. సుమారు 85 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రదర్శన.. హైదరాబాద్ వాసులకు కేవలం షాపింగ్ వేదిక మాత్రమే కాదు.. ఒక భావోద్వేగంతో కూడిన వేడుక అని ఆయన పేర్కొన్నారు. 85వ నుమాయిష్ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు వైభవంగా సాగనుంది. జనవరి 1న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రదర్శనను అధికారికంగా ప్రారంభిస్తారు. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఉంటుంది. శని, ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాల్లో రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుంది. ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలుగా నిర్ణయించారు. అయితే.. 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం పూర్తిగా ఉచితం. ఈసారి నుమాయిష్‌లో గతంలో కంటే ఎక్కువ స్టాళ్లు, వైవిధ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. దేశ విదేశాలకు చెందిన ఉత్పత్తులతో మొత్తం 2,000 కంటే ఎక్కువ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 1,050 మంది తయారీదారులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని ఇక్కడ ప్రదర్శించనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను



ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి స్టాళ్ల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రిజర్వ్ బ్యాంక్, అటవీ శాఖ, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాలు కూడా తమ సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. సందర్శకుల కోసం 20కి పైగా ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ హైదరాబాద్ ప్రత్యేక రుచులతో పాటు వివిధ ప్రాంతాల వంటకాలను ఆస్వాదించవచ్చు. సుమారు 25 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 82 ఫైర్ పాయింట్లు ఏర్పాటు చేశారు. లక్షన్నర లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు నీటి సంపులను సిద్ధం చేశారు. ప్రతి రెండు పాయింట్లకు ఒక అగ్నిమాపక సిబ్బంది పహారా కాస్తారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక వాచింగ్ టవర్లు, సీసీటీవీ కెమెరాలను అమర్చారు. 330 మంది వలంటీర్లు సందర్శకులకు సహకరించనున్నారునాంపల్లి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్ల నుంచి రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. నుమాయిష్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదు.. ఒక విద్యా నిధి కూడా. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ సుమారు 19 విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఇందులో దాదాపు 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోంది. షాపింగ్, వినోదం , సామాజిక సేవల కలయికగా సాగే నాంపల్లి ఎగ్జిబిషన్, ఈ ఏడాది కూడా హైదరాబాద్ వాసులకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# సింగిల్ డిజిట్‌కు టెంపరేచర్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్రమైన చలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిర్మల్ వంటి జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాబోయే సోమ, మంగళవారాల్లో చలి ఇంకా పెరిగే అవకాశం ఉందని.. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ 14 జిల్లాలకు 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది. ఈ తీవ్రమైన చలి గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలి ప్రభావం వల్ల కేవలం జలుబు, దగ్గు మాత్రమే కాకుండా.. రక్తపోటు పెరగడం, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఈ సమయంలో బయట తిరగకపోవడమే మంచిదని చెబుతున్నారు. చలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మఫ్లర్లు, సాక్సులు తప్పనిసరిగా ధరించాలని.. పడక గదిలో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎప్పుడూ వేడిగా ఉండే తాజా ఆహారాన్ని తీసుకోవాలని.. ఇది శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచుతుందని చెబుతున్నారు. చలికాలంలో దాహం తక్కువగా వేస్తుంది, కానీ డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటానికి గోరువెచ్చని నీటిని తగినంతగా తాగుతూ ఉండాలని... అల్లం టీ, కషాయం లేదా సూప్‌లు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంటున్నారు. చలి వల్ల చర్మం పొడిబారి పగుళ్లు వచ్చే అవకాశం ఉంటుంది, కాబట్టి మాయిశ్చరైజర్లు లేదా కొబ్బరి నూనెను రాసుకోవాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. ఆ సమయంలో ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలని. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తల, చెవులను కప్పి ఉంచేలా జాగ్రత్త పడాలని చెబుతున్నారు. ఇంటి లోపల వెచ్చదనం కోసం నిప్పు రగిల్చినప్పుడు గాలి ఆడేలా చూసుకోవాలని.. లేదంటే కార్బన్ మోనాక్సైడ్ వంటి విషవాయువుల వల్ల ప్రమాదం సంభవించవచ్చునని అంటున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ.. అప్రమత్తంగా ఉండటం ద్వారా ఈ చలి కాలం వచ్చే అనారోగ్యాల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చునని చెబుతున్నారు.

## కృష్ణానది ఎక్కడ ఉందో తెలియదు

హైదరాబాద్: కృష్ణానది ఎక్కడ ఉందని సీఎం రేవంత్ రెడ్డి అడగడం హస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బాక్రానంగల్ ప్రాజెక్ట్ ఏ రాష్ట్రంలో ఉన్న సంగతి కూడా సీఎంకు తెలియకపోవడం బాధాకరమన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకున్న వ్యక్తినే ఈ రోజు ప్రభుత్వం నీటి పారుదల శాఖ సలహాదారుగా నియమించిందని తెలిపారు. అసెంబ్లీలో నీటి సమస్యలపై దేనిమీద చర్చపెట్టాలో సైతం కనీసం ప్రభుత్వానికి అవగాహన లేదన్నారు. కేసీఆర్ చర్చకు వస్తున్నారని మంత్రులంతా ప్రిపరేషన్ మొదలు పెట్టారని రాష్ట్ర మంత్రులను కేటీఆర్ దుయ్యబట్టారు. ఈ రోజు జరిగిన అసెంబ్లీ సమావేశాలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. అయితే సభా కార్య కలాపాలపై ఈ రోజు బీఏసీ సమావేశం ముగిసింది. అసెంబ్లీ సమావేశాలను వారం రోజుల పాటు జరపాలని సమావేశంలో నిర్ణయించారు. అయితే అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నడపాలని బీఆర్ఎస్, 20 రోజులు నడపాలని బీజేపీ పార్టీలు పట్టుబట్టాయి. ఈ అంశంపై తదుపరి నిర్వహించే బీఏసీ కౌన్సిల్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు.

## ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టాలి

-మొదటిపేజీ తరువాయి

ఆధారాలతో సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లతో సీఎం సమావేశమయ్యారు.

**బీఆర్ఎస్‌కు దీటైన సమాధానం ఇచ్చేందికు సిద్ధమైన కాంగ్రెస్**

నదీ జలాల్లో వాటా, ఏపీతో వివాదాలు, బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలు, తదితరాలపై ఆరా తీశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో అందుకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించారు. ప్రాజెక్టు ప్రతిపాదించినప్పటి నుంచి పరిణామాలు, బీఆర్ఎస్ హయాంలో నిర్ణయాలు, పురోగతి, గత రెండేళ్లుగా పనులు, పరిణామాలపై అన్ని వివరాలు తీసుకున్నారు.

**జూరాల నుంచి అయితే తక్కువ ఎత్తుకే ఎత్తిపోయవచ్చు**

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం మొదట జూరాల నుంచి నీటిని తీసుకోవాలని ప్రతిపాదిస్తే, దానిని శ్రీశైలం బ్యాక్ వాటర్స్‌కు ఎందుకు మార్చారన్న విషయమై సీఎం ప్రధానంగా ఆరా తీసినట్లు సమాచారం. జూరాల నుంచి నీటిని తీసుకుని ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని, అనుమతులకు ఆటంకం వచ్చేది కాదని, నీటిని తక్కువ ఎత్తుకే ఎత్తిపోయాల్సి ఉండేదని అభిప్రాయపడ్డట్లు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించి జారీ చేసిన అన్ని జీవోలు, నిపుణుల కమిటీ నివేదికలు, అంచనా వ్యయం, సవరణలు, జలాశయాలు, పంపుల నిర్మాణం, కాల్వలు - డిస్ట్రిబ్యూటరీల తవ్వకం, పరిహారం చెల్లింపులు, భూసేకరణ సహా అన్ని వివరాలు సమగ్రంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

**బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ దీటైన సమాధానం**

డీపీఆర్, బీఆర్ఎస్ హయంలోనే వెనక్కు వచ్చినప్పటికీ, అప్పటి ప్రభుత్వం స్పందించలేదని సీఎం అన్నట్లు తెలిసింది. కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి చేసుకున్న ఒప్పందాలు, మినిట్స్, తదితర ఆధారాలన్ని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ తప్పిదాలను ఎత్తిచూపుతూ అసెంబ్లీ వేదికగా ఎండగట్టడంతో పాటు ప్రజలకు అన్ని విషయాలను వివరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకోసం అవసరమైన అన్ని ఆధారాలు, డాక్యుమెంట్లతో సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు హాజరవుతారన్న సమచారం మేరకు, ఆయన అడిగే ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం ఇచ్చేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులకు కట్టిన వడ్డీలు ఎంత, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం పరంగా తీసుకుంటున్న చర్యలను వివరించాలని నిర్ణయించారు. ప్రజలపై బారం పడకుండా ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎలా ముందుకెళ్తున్నామనే అంశంపైనా సమాచారంతో సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

అదేవిధంగా ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిని ఓఆర్ఆర్ వరకు విస్తరించడం, 150గా ఉన్న డివిజన్లను 300లకు పెంచడం తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చ చేపట్టే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసిన ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సన్నదమవుతోంది. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ పరంగా ఏవిధంగా ముందుకు వెళ్లాలి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సీఎం రేవంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయిన కేసీఆర్

-మొదటిపేజీ తరువాయి

షేక్ హ్యాండ్ ఇచ్చి కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆ సమయంలో కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి తప్ప అంతా నిల్చున్నారు.

ఆపై మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి సహా అధికార పార్టీ విప్‌లు కూడా కేసీఆర్‌ను పలకరించారు. నూతనంగా ఎన్నికైన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సైతం కేసీఆర్‌ను పలకరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అయితే.. ఆ తర్వాత ఆయన సభలో కనిపించలేదు. అసెంబ్లీ అటెండెన్స్ రిజిస్ట్రర్‌లో సంతకం చేసిన అనంతరం జీరో అవర్ ప్రారంభం కాకముందే కేసీఆర్ వెళ్లిపోయారు. అక్కడి నుంచి ఆయన నేరుగా నందినగర్ నివాసానికి చేరుకున్నారు.

కాగా, కృష్ణా జలాల పంపిణీపై జరగనున్న శీతాకాల సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలున్నాయి. ఈ అంశంపై ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందనతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధాన్ని బట్టి చూస్తే ఈసారి అసెంబ్లీ వాడీవేడిగా జరగనుందని తెలుస్తోంది. ఈసారి కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ పట్టుపడుతోంది. అయితే నేటి పరిణామం నేపథ్యంలో కేసీఆర్ సభకు హాజరవుతారా? లేదా? అనే ఉత్కంఠ కొనసాగనుంది.

## ఇలా చేస్తే పదవులు ఊస్ట్!

హైదరాబాద్

తెలంగాణ పంచాయతీ పాలకవర్గంలో సర్పంచి, ఉప సర్పంచికి సంయుక్తంగా చెక్ పవర్ ఉంటుంది. పంచాయతీ అవసరాలు, అభివృద్ధికి ఖర్చు చేసే ప్రతి రూపాయికి ఇద్దరి ఆమోదం కచ్చితంగా ఉండాలి. ఐతే ఇద్దరి సంతకాల చుట్టూ జరిగే రాజకీయాలు, పొరపాట్లు ఒక్కోసారి వారిద్దరి పదవులకే ఎసరుపెడతాయి. చెక్ పవర్ అనేది ప్రజాధనాన్ని రక్షించేందుకు ఇచ్చిన నమ్మకం. ప్రతి పైసా ఖర్చుకు గ్రామ సభ తీర్మానం కచ్చితంగా ఉండాలి. నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల వినియోగం వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ దస్త్రాల్లో నమోదు చేయాలి. ఇలా చేయటం వల్ల సర్పంచి, ఉప సర్పంచులు తమ పదవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని రాజకీయ నిపుణులు అంటున్నారు.

ఇలా చేస్తే సర్పంచి, ఉప సర్పంచి పదవులు ఊస్ట్ : -

పంచాయతీ నిధులను వ్యక్తి గత అవసరాలకు వాడినా, పనులు చేయకుండా బిల్లులు విత్ డ్రా చేసినా, అంచనాలకు మించి ఖర్చు చూపినా నేరం కింద పరిగణిస్తారు. విచారణలో నిధులు దుర్వినియోగమైనట్లు రుజువు ఐతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచి, ఉప సర్పంచిలను పదవుల నుంచి తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. సర్పంచి, ఉప సర్పంచి సంతకాలను పరస్పరం ఫోర్జరీ చేసినా, అధికారులను మభ్య పెట్టి నిధులు తీసుకున్నా క్రిమినల్ కేసులు నమోదు అవుతాయి. కేవలం పదవి పోవడమే కాకుండా జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉంది.

గ్రామ సభ తీర్మానాలను అతిక్రమించి నిధులు వినియోగం చెక్కులపై సంతకాలు చేయడాన్ని అధికార దుర్వినియోగం కిందకే వస్తోంది.

# లెదర్ పార్క్ సాధనకు చర్మకారుల ఐక్యత

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంటలో సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జమ్మికుంట చర్మకారుల హక్కుల సాధన, ఉపాధి అవకాశాల విస్తరణ లెదర్ పార్క్ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్న లెదర్ పార్క్ సాధన చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సంఘ ప్రతినిధులు, చర్మకార సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్మకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ముడిసరకుల కొరత, మార్కెటింగ్ ఇబ్బందులు, ప్రభుత్వ ప్రోత్సాహం లోపం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో లెదర్ పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక లెదర్ పార్క్ ఏర్పాటు చేయడం ద్వారానే చర్మకార కుటుంబాలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా మోతె స్వామి ఎన్నిక కాగా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాచర్ల దశరథం, ఉపాధ్యక్షుడిగా మారపల్లి పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా కొలుగూరి విజయకుమార్ ఎంపికయ్యారు. కార్యదర్శులుగా వంతడుపుల కొమరయ్య, కన్నూరి సురేష్, కొండేలపు రాము, సహాయ కార్యదర్శులుగా శనిగారపు శ్రీనివాస్, మోతె సారయ్య, జీడి సాంబయ్య ఎన్నికయ్యారు. ప్రెస్ ఇంచార్జ్‌గా ఇమ్మడి రాజు, ప్రచార కార్యదర్శులుగా కాంపల్లి సంపత్, బొజ్జ పెల్లి నర్సింగ్, అసంపల్లి రాయమల్లు నియమితులయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బచ్చలి రాజనర్సు, యు. రాఘవులు, బుంగ ప్రకాష్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేసిన మాజీ రాష్ట్ర అధ్యక్షులు పోత్తూరి రమేష్ (రుక్మాపూర్) కి సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మారపల్లి మొగిలయ్య, ఎంపీఎమ్మెల్యే కాంటెస్ట్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దాసరి రామస్వామి మాట్లాడుతూ,



చర్మకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు, సబ్సిడీలు, రుణాలు సమర్థవంతంగా అందేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెదర్ పార్క్ సాధనకు అన్ని వర్గాల సహకారంతో ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. సంఘం నూతన కార్యవర్గం రాబోయే రోజుల్లో చర్మకారుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు, పరిశ్రమల శాఖ, హస్తకళల శాఖలతో సమన్వయం చేసుకుంటూ శిక్షణ కేంద్రాలు, మార్కెటింగ్ వేదికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చర్మకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశం పిలుపునిచ్చింది

## జనగామలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో బిసి కమిషన్ మెంబర్ రంగు బాల లక్ష్మి



**సామాన్యుడి అస్త్రం జనగామ** ఉపాధ్యాయిని, కవయిత్రి, నటి కొట్టె శ్రీలత, శ్రీనివాస్ దంపతుల కూతురు యసీకశ్రీ మొదటి జన్మదిన వేడుకలు సోమవారం జనగామ వై ఎస్ ఎస్ ఆర్ భవన్ లో ఘనంగా జరిగాయి. ఈ పుట్టినరోజు వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ మెంబర్ రంగు బాల లక్ష్మి, శ్రీనివాస్ తో పాటు చరిత్ర పరిశోధకులు రెడ్డి రత్నాకర్ రెడ్డి, కవులు కళాకారుల ఐక్య వేదిక జి.వై.గిరి పౌండేషన్ జి.కృష్ణ, అభినందన సోషల్ కల్చరల్ సొసైటీ అయిలా సోమనర్సింహచారి, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరాచారి, తెలంగాణ గౌడ రచయితల సంఘం గడ్డం మనోజ్ కుమార్, గొలుసుల నర్సయ్య, కవయిత్రి డా.మాదంశెట్టి వరూధిని, డిఒపి శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి చేసుకొని శ్రీ రాజన్న ను దర్శించుకున్న పెండ్యాల విక్రమార్క



**సామాన్యుడి అస్త్రం:కోనరావుపేట** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వ ఆలయం ను దర్శించుకున్న ( ౹ాన.ఞ.) పూర్తి చేసుకొని శ్రీ రాజన్న ను దర్శించుకున్న పెండ్యాల విక్రమార్క౹ాన.ఞ గారినీ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది భవన నిర్మాణ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మరియు అపాద్బాంధవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అక్కేనాపెల్లీ భాస్కర్ రాజన్న శాలువా తో సత్కరించడం జరిగింది జిల్లా అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ ఎన్నో అటు పోట్లు ఎదుర్కొని ఇంతటి స్థాయికి ఎదిగిన అన్న జూష్ట్ర.న సాధించి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గా ఎదిగిన విక్రమార్క అన్న గారికి శుభాకంక్షలు తెలియచేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కేనపెల్లి భాస్కర్ మరియు. నర్మేట రమేష్ అడ్వికేట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు. నవీన్ అడ్వికేట్.గంగాధర్ అడ్వికేట్.సారన్న.అఖిల్.జహీర్.సుకుమార్.నవీన్(లడ్డు) నరేష్ లు మరియు తదితరులు పాల్గొన్నారు

## జమ్మికుంట మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలపై ప్రజాగర్జన

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** 80 లక్షల నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ కోరుతున్న ప్రజలు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో జరిగిన భారీ అవినీతి అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. స్మశాన భూముల కబ్జాలు, డీజిల్ ఖర్చుల పేరుతో నిధుల దుర్వినియోగం, పనులు పూర్తికాకముందే కోట్లాది రూపాయల బిల్లులు మంజూరు చేయడం వంటి అంశాలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా స్మశాన పనులు పూర్తికాకముందే అప్పట్లో విధుల్లో ఉన్న ఏఈ ద్వారా సంబంధిత కాంట్రాక్టర్‌కు సుమారు 80 లక్షల రూపాయల నిధులు విడుదలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ప్రజాధనాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేసిన చర్యగా స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అంశాలపై గతంలోనే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ అవినీతికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బాధితులు వెల్లడిస్తున్నారు. స్మశాన భూముల కబ్జాలు జరిగాయనే ఆరోపణలు, డీజిల్ ఖర్చుల పేరిట తప్పుడు బిల్లులు, నాణ్యత లేని పనులు చేసినా పూర్తి బిల్లులు చెల్లించడం వంటి అంశాలపై సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని జమ్మికుంట ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగమైన ప్రతీ అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. జమ్మికుంట మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై నిజానిజాలు బయటపడాలంటే విజిలెన్స్ శాఖ తక్షణమే రంగంలోకి దిగాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు



## హుజురాబాద్ ఎంఈఓపై ఫిర్యాదుకు స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** ఎస్‌హెచ్‌ఆర్‌సీ డైరీ నం. 7146/సీఆర్/2025 కేసు నం. 3874/36/2/2025గా నమోదు త్వరలో నోటీసులు విచారణకు ఆదేశాలు పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోం : కొలుగూరి సూర్యకిరణ్ హుజురాబాద్ మండల విద్యాధికారిపై (ఎంఈఓ) చేసిన ఫిర్యాదుకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (౹ాన=జ) స్పందించిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ మెంబర్ కొలుగూరి సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు ౹ాన=జ డైరీ నంబర్ 7146/సీఆర్/2025, కేసు నంబర్ 3874/36/2/2025 కింద కేసు నమోదు చేసి, త్వరలో నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తే, ఆ ఆశయాలను తుంగలో తొక్కుతూ హుజురాబాద్ మండల విద్యాధికారి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు అత్యంత కీలకమైన గణితం బోధించాల్సిన ఉపాధ్యాయుడిని తన కార్యాలయ పనుల కోసం వినియోగించుకోవడం వల్ల పేద విద్యార్థుల విద్యా హక్కులు హరించబడ్డాయని అన్నారు. గోపాల్ రెడ్డి అనే ఉపాధ్యాయుడిని తరగతుల నుంచి తప్పించి కార్యాలయ అవసరాలకు వాడుకోవడంపై గత రెండు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై వివిధ దశల్లో జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (వరంగల్), పాఠశాల విద్యా కమిషనర్-డైరెక్టర్ (తెలంగాణ)లకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. చివరకు విద్యార్థుల విద్యా హక్కును కాపాడేందుకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించామని, కమిషన్ స్పందించి కేసు నమోదు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అంత తేలికగా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు గణిత విద్య అందకుండా చేసిన బాధ్యులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని, అలాగే లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. సంబంధిత అధికారి మరియు ఉద్యోగిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. చివరగా విద్యార్థుల హక్కుల పరిరక్షణకు స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు

# యువకుడి హఠాత్ మరణం రెండు గ్రామాల్లో విషాదఛాయలు

జ్వరంతో ఆసుపత్రికిడ అంబులెన్స్‌లోనే ప్రాణాలు విడిచిన చింటూ

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలో చోటుచేసుకున్న విషాద ఘటన రెండు గ్రామాలను ఒక్కసారిగా శోకసంద్రంలోకి నెట్టింది.

**అస్త్రం కరీంనగర్ జిల్లా:** అమ్మనగుర్తి (గుండ్లపల్లి) గ్రామానికి చెందిన, ప్రస్తుతం శలపల్లి ఇందిరానగర్ గ్రామంలో నివాసం ఉంటున్న యువకుడు ఎర్ర చరణ్ (చింటూ) నేడు హఠాత్తుగా మృతిచెందాడు. ఈ వార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఎర్ర చరణ్ అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా, ఆప్యాయతతో పలకరించే స్వభావంతో, ఒక మంచి స్నేహితుడిగా గ్రామాల్లో మంచి పేరు సంపాదించుకున్నాడు. ఎవరికైనా అవసరం వస్తే ముందుండి సహాయం చేసే వ్యక్తిగా చింటూ పేరుంది. అలాంటి యువకుడి అకాల మరణం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. వివరాల్లోకి వెళితే, గత కొన్ని రోజులుగా చరణ్ తీవ్రమైన జ్వరంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు వెంటనే హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉందని నిర్ధారించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎం.జి.ఎం ఆసుపత్రికి తరలించాలని సూచించడంతో అంబులెన్స్‌లో తీసుకువెళ్తుండగా, మార్గమధ్యలోనే చరణ్ ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనతో చరణ్ సొంత గ్రామమైన అమ్మనగుర్తి (గుండ్లపల్లి) లోనూ, ప్రస్తుతం నివాసం ఉంటున్న శలపల్లి



ఇందిరానగర్ గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. యువకుడి మరణ వార్త విన్న వెంటనే పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి, కుటుంబాన్ని ఓదార్చారు. తోటి స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ, తమ స్నేహితుడి జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువ వయసులోనే చరణ్ మృతి చెందడం రెండు గ్రామాలకు తీరని లోటుగా మారింది. అతని మంచితనం, స్నేహభావం, సేవా మనసు ఎప్పటికీ గుర్తుండిపోతాయని గ్రామ పెద్దలు భావోద్వేగంగా తెలిపారు. ఈ విషాద ఘటనతో గ్రామాల్లో నిశ్శబ్దం నెలకొని, ప్రతి ఇంటా చరణ్ మృతి పట్ల చర్చ జరుగుతోంది. ఒక యువ ప్రాణం ఆగిపోవడంతోడరెండు గ్రామాల గుండెలు బరువెక్కాయి.

## కమలాపూర్‌లో శిశు మందిర్ ప్రహరీ గోడ, గేటు ప్రారంభం

**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాలకు నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడ, గేటును రోటరీ క్లబ్ గవర్నర్ ఎస్.వి. రాంప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిశు మందిర్ విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో గవర్నర్ ఎస్.వి. రాంప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం భద్రతా లోపమేనని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని రోటరీ క్లబ్ వరంగల్ ఆశ్రయ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు కార్యదర్శుల సమన్వయంతో సీఎస్ఆర్ భద్రకాళి ఫ్యూచర్స్ వారి సహకారంతో ప్రహరీ గోడ నిర్మించి గేటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదుపాయం వల్ల భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. శిశు మందిర్ వంటి విద్యాసంస్థల్లో చదువుకోవడం ద్వారా విద్యార్థులకు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి సంప్రదాయాలు మంచి అలవాట్లు అలవడతాయని తెలిపారు. తద్వారా వారు సమాజంలో మంచి పౌరులుగా ఎదిగి పేరు ప్రఖ్యాతులు



సంపాదిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన శిశు మందిర్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు దొడ్డ వాణి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ సభ్యులు దొడ్డ రమేష్ రోటరీ క్లబ్ ఆశ్రయ్ వరంగల్ వారి సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించగా, శిశు మందిర్ ప్రధానాచార్యులు కాదూరి స్వరూపాచార్యులు, శిశు మందిర్ అధ్యక్షుడు దోమకుంట్ల ఓం ప్రకాష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గ్రామ పెద్దలు, వైశ్య సంఘ నాయకులు సురేష్ తదితరులు హాజరయ్యారు.

## కొత్త ఏడాదిలో సేమ్ జోష్...

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. రెండో ఏడాది పాలనపై ప్రజలు అనేక అంచనాలు పెట్టుకున్నారు. ఆమేరకు పాలన అందించలేకపోయినా.. పార్టీకి ఈ ఏడాది కూడా బాగా కలిసి వచ్చింది. 2025లో ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకం ప్రారంభించారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించింది. దీంతో పార్టీపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదు అన్న భావన హస్తం నేతల్లో నెలకొంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం 2025 ప్రారంభంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించింది. మొదట స్థలం ఉండి ఇల్లు లేనివారిని ఎంపిక చేశారు. నియోజకవర్గానికి 3500 చొప్పున 119 నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇక ఈ ఏడాది ఉగాది నుంచి రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారుల్లో సంతోషం కనిపిస్తోంది. ఇదే ఏడాది కొత్త రేషన్‌కార్డుల జారీ మొదలు పెట్టారు. 2024లో దరఖాస్తులు స్వీకరించినా.. జారీ మాత్రం ఈ ఏడాది మొదలైంది. అర్హులందరికీ కార్డులు జారీ అయ్యాయి. దీంతో రేవంత్ సర్కార్‌పై సానుకూలత నెలకొంది. అయితే సన్నవడ్ల బోనస్ యాసంగిలో ఇవ్వలేదు. ఇక మహిళలకు రూ.2,500 నగదు, పింఛన్ల పెంపు హామీ నెరవేరలేదు. ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు చేశారు. మహిళా సంఘాలకు క్యాంటీన్లు, బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు ఇచ్చారు. మహిళల ఆర్థిక శక్తి పెంపే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో మహిళా సంఘాల్లో రూ.2,500 ఆర్థికసాయం అందలేదన్న ఆలోచన కలుగడం లేదు. ఇక ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతోంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ పథకాలు అమలవుతున్నాయి. 2025లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నిర్వహించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ స్థానం అయిన జూబ్లీహిల్స్‌లో హస్తం పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సమష్టిగా పనిచేసి విజయం సాధించారు. ఇక డిసెంబర్‌లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లోనూ హస్తం పార్టీ సత్తా చాటింది. కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది. స్థానిక సంస్థల్లో బీజీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపగా ఆయన ఆమోదం తెలుపలేదు. దీంతో చట్టరూపం దాల్చలేదు. అయినా రేవంత్ సర్కార్ జీవో ద్వారా రిజర్వేషన్ల అమలుపై జీవో ఇచ్చింది. అయితే దీనిని కోర్టులు కొట్టేశాయి. దీంతో రేవంత్ సర్కార్ ప్రయత్నించింది అన్న భావన బీసీల్లో నెలకొంది. దీంతో పంచాయతీ ఎన్నికలోల సానుకూల ఫలితాలు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచి. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ పూర్తి చేశారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల వివరణ తీసుకున్నారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ మినహా 8 మంది వివరణ ఇచ్చారు.

# కొంతిలి గ్రామానికి అభివృద్ధి దీపం

**కొన్ని సంవత్సరాల కలగా మిగిలిన కమ్యూనిటీ హాల్‌కు శుభారంభం**

**గ్రామ ఐక్యతకు నిలువెత్తు చిహ్నంగా రూపుదిద్దుకోనున్న కమ్యూనిటీ హాల్**

**కొంతిలి సర్పంచ్ రేగం రమేష్**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** సంవత్సరాల తరబడి కొంతిలి గ్రామ ప్రజలు గుండెల్లో దాచుకున్న ఒక గొప్ప అభివృద్ధి స్వప్నం నేడు సాకార రూపం దాల్చింది. గ్రామ అవసరాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ శుభారంభం గ్రామమంతా ఆనందోత్సాహాలతో నింపింది. జిల్లా పరిషత్ నిధుల ద్వారా రూ.12 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొంతిలి గ్రామ అభివృద్ధి ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ శుభకార్యాన్ని కొంతిలి పంచాయతీ సర్పంచ్ రేగం రమేష్, వైస్ సర్పంచ్ తాంగుల వెంకట్రావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇప్పటివరకు సరైన వసతుల లేమితో గ్రామస్తులు ఎదుర్కొన్న అనేక ఇబ్బందులకు ఈ కమ్యూనిటీ హాల్ శాశ్వత పరిష్కారంగా మారనుంది. గ్రామ సభలు, సమావేశాలు, శుభకార్యాలు, సామూహిక కార్యక్రమాలు, సామాజికసాంస్కృతిక వేడుకలకు ఇది కేంద్రబిందువుగా నిలిచి, గ్రామ ఐక్యతను మరింత బలోపేతం చేయనుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విలువైన స్థలాన్ని విరాళంగా అందించిన సొంటిని పుణ్యారావు (లేటు) పుణ్యవతి దంపతుల సేవా త్యాగాన్ని ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలతో స్మరించుకున్నారు. వారి దాతృత్వం తరతరాలకు ఆదర్శంగా నిలవాలని పలువురు పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్‌కు స్లాబ్ వేయడం ప్రారంభమైన వేళ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని, ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిపారు. “ఇది కేవలం ఒక భవనం కాదుడ కొంతిలి గ్రామ భవిష్యత్తుకు బలమైన పునాది” అంటూ గ్రామస్తులు భావోద్వేగంతో స్పందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు: ఈ శంకుస్థాపన కార్యక్రమంలో నుంచి ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. ధ్రువ కుమార్,




టెక్నికల్ అసిస్టెంట్లు కె. జగన్, బి. కుమార్, ములియపుట్టు పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గౌతమి, ఓల్డా పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పూజారి అభినాష్, కాంట్రాక్టర్ పి. పైడిరాజు, తదితర అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధిని ధ్యేయంగా చేసుకుని నిరంతరం కృషి చేస్తున్న పంచాయతీ పాలకవర్గానికి ఈ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని, కొంతిలి గ్రామ అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

# పాడేరు డివిజన్‌ను జోన్1లోనే కొనసాగించాలి

**రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ప్రత్యేక వినతిపత్రాలు సమర్పించిన వంపూరు గంగులయ్య**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మల్టీ జోన్లు, ఆరు జోన్లుగా విభజించిన నేపథ్యంలో, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జోన్1 (విశాఖ జోన్)లోనే కొనసాగించాలి అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డా. వంపూరు గంగులయ్య రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌లకు పాడేరు డివిజన్ పరిస్థితిని వివరించారు. జోనల్ విధానంలో మార్పులు అవసరం గత ప్రభుత్వం తీసుకొచ్చిన అస్తవ్యస్త జోనల్ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం సవరించడం స్వాగతార్హమని, అయితే ఈ మార్పుల్లో వెనుకబడిన గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి అవసరమని వంపూరు గంగులయ్య స్పష్టం చేశారు. పాడేరు, రంపచోడవరం డివిజన్లు అభివృద్ధి, ఉపాధి అవకాశాల్లో తీవ్రంగా వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. రాజమండ్రికి సమీపంలో ఉన్న రంపచోడవరం డివిజన్‌ను జోన్2లో చేర్చడం సబబేనని, కానీ విశాఖతో చారిత్రకంగా, భౌగోళికంగా అనుబంధం ఉన్న పాడేరు డివిజన్‌ను మాత్రం జోన్1లోనే కొనసాగించాల్సిన అవసరం ఉందని స్పష్టంగా తెలిపారు. నిరుద్యోగం పెరిగే ప్రమాదం పాడేరు డివిజన్‌లో పరిశ్రమలు లేవని, గత ప్రభుత్వ కాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా రాకపోవడంతో నిరుద్యోగిత భారీగా పెరిగిందని వినతిపత్రంలో వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో పాడేరు డివిజన్‌ను జోన్2కు తరలిస్తే, జోన్1లో లభించే పారిశ్రామిక, ఉద్యోగ అవకాశాల నుంచి గిరిజన యువత దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గిరిజన యువతపై ప్రతికూల ప్రభావం ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాల వల్ల గిరిజన యువతలో ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తోందని, కానీ మరోసారి నిరుద్యోగం పెరిగితే యువత మళ్లీ పాత మార్గాల వైపు వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం గిరిజన ప్రాంతాలకు కల్పించిన ప్రత్యేక హక్కులు, సదుపాయాల అమలులో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని, గత ప్రభుత్వంలో జీవో నెంబర్ 3 విషయంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దే క్రమంలో ఈ జోనల్ నిర్ణయాలు కూడా అనుగుణంగా ఉండాలని సూచించారు. జోన్1లోనే కొనసాగించాలన్న స్పష్టమైన డిమాండ్ పాడేరు డివిజన్‌ను పూర్తిస్థాయిలో జోన్1లోనే కొనసాగించడం ద్వారానే గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు, అభివృద్ధి ఫలాలు అందుతాయని వంపూరు గంగులయ్య అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఉప ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం, జోన్1 ప్రాధాన్యతపై అధికారులకు సూచనలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి గిరిజన జాతికి సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, చిన్న నిర్లక్ష్యం కూడా జాతికి నష్టం కలిగించే అవకాశముందని పేర్కొన్నారు. పాడేరు డివిజన్



జోన్1లోనే కొనసాగించేందుకు మిగతా ప్రజాప్రతినిధులు కూడా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేసి సహకరించాలని కోరారు. త్వరలోనే జోనల్ విధానంలో మార్పులు జరిగి పాడేరు డివిజన్ జోన్1లోనే కొనసాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# జిల్లా క్రీడా చరిత్రలో స్వర్ణాధ్యాయం

**రాంబో కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో అల్లూరి అనకాపల్లి విద్యార్థుల మెరుపులు**

**నాలుగు గోల్డ్‌లు అల్లూరికిడ 11 పతకాలతో చోడవరం ప్రతిభావంతుల ప్రదర్శన**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** పూర్ణమార్కెట్‌లోని ఇందిరా ప్రియదర్శిని మునిసిపాలిటీ స్టేడియం వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి రాంబో కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మరియు అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతానికి చెందిన విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించి మొత్తం 11 పతకాలు సాధించి మెరిశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పాల్గొన్న నలుగురు విద్యార్థులు నాలుగు విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించి జిల్లా క్రీడా చరిత్రలో సువర్ణ ఘట్టాన్ని నమోదు చేశారు. కఠినమైన పోటీలను ధైర్యంగా ఎదుర్కొని, శారీరక దృఢత్వం, సాంకేతిక నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో పోరాడి ఈ ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. గోల్డ్ మెడల్స్ :1. షేక్ మహమ్మద్ 18 కేజీల విభాగం 2. షేక్ అబ్దుల్ షాయిడ్ 28 కేజీల విభాగం 3. ఎన్. అనిల్ కుమార్ 43 కేజీల విభాగం 4. ఎన్. గణేష్ 50 కేజీల విభాగం సిల్వర్ మెడల్స్ : 5. ఎస్. నాని 38 కేజీల విభాగం 6. ఎం. నంద కిషోర్ 36 కేజీల విభాగం బ్రాంజ్ మెడల్ : 7. బి. కిరణ్ 68 కేజీల విభాగం అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు : 8. హుకుంపేట మండలం, కొండ చీదడిపుట్టు వి. బాలేష్ (60 కేజీలు) 9. పెద్దబయలు మండలం, పర్రెడ ఎన్. గంగాధర్ (50 కేజీలు) 10. హుకుంపేట మండలం రుడి టీ. రామ్ సాయి (48 కేజీలు) 11. పెద్దబయలు మండలం, చీమ ఉకుర్భా యు. చరణ్ (55 కేజీలు) ఈ జిల్లా స్థాయి రాంబో కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌ను ఆర్గనైజర్ కనకరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టోర్నమెంట్‌ను విశాఖ సౌత్ జోన్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మరియు జీవీఎంసీ చైర్మన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా పంచాయతీ సీనియర్ మెంబర్ టీ. శ్రీను, చోడవరం ఎమ్మెల్యే రాజు లు “ఎస్ కె.మౌలానా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ” విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



జిల్లా స్థాయి పోటీల్లో సాధించిన ఈ విజయాలు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కృషి, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చోడవరం కోచ్ షేక్ హుస్సేన్, అల్లూరి జిల్లా కోచ్ ఎన్. రామారావు తదితరులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల నుంచే జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదుగుతారన్న దానికి ఈ విజయాలు స్పష్టమైన నిదర్శనంగా నిలిచాయి.

## రక్తదాతలు ముందుకు రావాలి

**జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపు**

**జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ప్రజల భాగస్వామ్యంతోనే ప్రాణరక్షణ**

**అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో రక్తపు నిల్వలను పెంచి, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల్లో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం ద్వారా సమాజానికి అమూల్యమైన సేవ అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసి అరకు లోయ, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఏటిడబ్ల్యువోలు సమన్వయంతో రక్తదాన శిబిరాలు సక్రమంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యవర్గం రక్త సేకరణలో విశేషంగా కృషి చేస్తోందని ఆయన అభినందించారు. షెడ్యూల్ ప్రకారం అన్ని మండలాల్లో అధికారులు



సమన్వయంతో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఆదేశించిన కలెక్టర్, రక్తం అందక ఒక్క ప్రాణం కూడా కోల్పోయే పరిస్థితి రాకూడదనే లక్ష్యంతో ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాకుండా ప్రజల సామూహిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరుహుకుంపేట ఏటిడబ్ల్యూ ఓ అఖిల స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన దాతృత్వాన్ని అధికారులు, ప్రజలు అభినందించారు. ఈ రక్తదాన శిబిర కార్యక్రమంలో హుకుంపేట తహసిల్దార్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, కోశాధికారి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. నాగరాజు, సభ్యులు ప్రసాద్ నాయుడు, రవి, వైద్య బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి ప్రాణం ఉత్తమ కార్యకర్తలకు ఘన సన్మానం

**ఉత్తమ కార్యకర్త నుంచే ఉత్తమ నాయకుడు రూపుదిద్దుకుంటాడు : సియ్యారి దొన్నుదొర**



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని, వారి అంకితభావమే పార్టీని విజయపథంలో నడిపిస్తోందని అరకు వ్యాలీ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర స్పష్టం చేశారు. హుకుంపేట మండల కేంద్రంలో నిర్వహించిన “సుపరిపాలనలో తొలి అడుగు” కార్యక్రమంలో భాగంగా, పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉత్తమ కార్యకర్తలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జన్ని మత్స్యరాజు, పెట్టెలీ రాజ్ కుమార్, మజ్జి జగన్నాథం, బూరుగు బోయిన సురేష్, కిరసాని కృష్ణ రావులకు ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యకర్తకు గౌరవం పార్టీకి గర్వకారణం ఈ సందర్భంగా సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ, “ఉత్తమ కార్యకర్త నుంచే ఉత్తమ నాయకుడిని తయారు చేసే గొప్ప పార్టీ తెలుగుదేశం పార్టీ. కార్యకర్తల కష్టం గుర్తించి ప్రోత్సహించడమే మా సంప్రదాయం” అని అన్నారు. లోకేష్ అభినందనలు కార్యకర్తల కృషిని గౌరవిస్తూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారి సేవలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హృదయపూర్వకంగా ప్రశంసించినట్లు తెలిపారు. ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని దొన్నుదొర పిలుపునిచ్చారు. ప్రతి బూత్, యూనిట్, క్లస్టర్, గ్రామ కమిటీ, మండల కమిటీ స్థాయిలో సమిష్టిగా పనిచేయాలని సూచించారు. విస్తృతంగా పాల్గొన్న పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల అధ్యక్షులు శతక బొంజుబాబు, అరకు వ్యాలీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు సూర్యకాంతం, సీనియర్ నాయకులు బాకూరు వెంకటరమణ, సత్యనారాయణ, శశిభూషణ్ నాయుడు, పాడి బాలన్న, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పాంగి రవీంద్ర, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు లకే నాగేశ్వర రావు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, తెలుగు రైతు, ఎస్టీ సెల్, ఐటీడీపీ, పీఏసీఎస్, క్లస్టర్ ఇంచార్జ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, యువ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యకర్తల సన్మానంతో ఉత్సాహం ఉత్తమ కార్యకర్తలకు లభించిన ఈ గుర్తింపు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, రానున్న రోజుల్లో మరింత శక్తివంతంగా ప్రజాసేవలో ముందుకు సాగుతామని కార్యకర్తలు పేర్కొన్నారు.

## అసెంబ్లీ సమావేశాల వేళ మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు




**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ప్రజాస్వామ్య స్వరాన్ని అణిచివేయడమేనా? తీవ్ర విమర్శలు రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజకీయంగా, ప్రజాస్వామ్యపరంగా తీవ్ర చర్చకు దారి తీస్తోంది. పాత బకాయి బిల్లులు చెల్లించాలంటూ శాంతియుతంగా తమ గోడును ప్రభుత్వానికి వినిపించేందుకు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారనే అనుమానంతో మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేయడం అత్యంత బాధాకరమని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. గ్రామాభివృద్ధికి అప్పులు చేసి పనులు పూర్తి గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, నీటి సరఫరా వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అప్పటి సర్పంచులు వ్యక్తిగతంగా అప్పులు చేసి, కాంట్రాక్టర్లను నమ్మించి పనులు పూర్తి చేశారని వారు గుర్తుచేస్తున్నారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇప్పటికీ వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయమైన డిమాండ్లకే నిర్బంధమా? మకు రావాల్సిన న్యాయమైన బకాయిల కోసం శాంతియుత నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు అని, అలాంటి హక్కును హరించేందుకే ముందస్తు అరెస్టులు చేశారని మాజీ సర్పంచులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సమస్యలను చర్చకు తీసుకురావాలనే ఉద్దేశంతో అసెంబ్లీ ముట్టడి చేస్తారన్న కారణంతో ముందుగానే నిర్బంధించడం ప్రభుత్వ భయాన్ని, నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన మాజీ సర్పంచులను నేరస్తుల్లా చూస్తూ అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం అని విమర్శకులు అంటున్నారు. సమస్యపై చర్చించి పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం, నిర్బంధ రాజకీయాలకు పాల్పడటం సరికాదని స్పష్టం చేస్తున్నారు. వెంటనే అరెస్టులు ఎత్తివేయాలి మాజీ సర్పంచులపై పెట్టిన ముందస్తు అరెస్టులు, నిర్బంధాలను తక్షణమే ఎత్తివేసి, పాత బకాయి బిల్లుల చెల్లింపుపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చర్చల ద్వారా సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు బాధ్యతగా పనిచేసిన తమను ఇలా అవమానించడం తాము ఎన్నటికీ అంగీకరించబోమని మాజీ సర్పంచులు స్పష్టంచేశారు

# ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు చిన రమణయ్య పేట స్కూల్ కమలంపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీ విజిట్ చేసిన

సత్యనారాయణ దొర

**సామాన్యుడి అస్త్రం దేవీపట్నం** ఈరోజు దేవీపట్నం మండలంలోని చిన్న రమణయ్య పేట , కమలం పాలెం గ్రామం లో ఉన్నటువంటి కోయ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర విద్యా కమిషన్ ఉత్తర్వులు మేరకు రాజవోమ్మంగి ఎం.ఈ.ఓ గారు అయినటువంటి కె.వి.వి.సత్యనారాయణ దొరగారు తనిఖీ చేయడం జరిగింది.ఎయిడెడ్ స్కూల్లో ఉన్నటువంటి రికార్డులు, పిల్లలు ఎంతమంది ఉన్నారు .పిల్లలు ఎలాగ చదువుతున్నారు ,పిల్లలు హాజరు ఇవి అన్ని తనిఖీ చేయడం జరిగింది. ఎయిడెడ్ స్కూల్లో మొత్తం పిల్లలు 31 కి గాను ఈరోజు 30 మంది హాజర అవ్వడం జరిగింది. పిల్లలు స్కూలు కు సంబంధించి ఇంతకుముందు ఈ స్కూలు చిన్న రమణయ్యపేట లో 50 సెంట్లు స్థలంలో




పక్కా పెంకుటిల్లులో విశాలమైన ఆట స్థలంలో ఉండడం జరిగింది. ఇప్పుడు అదే స్కూలు ను పోలవరం నిర్వాసితుల కాలనీ అయిన కమలం పాలంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ లో అదే స్కూలు ను ఇక్కడ నిర్మించి ఇచ్చి ఆటస్థలం ఉన్నది. ముఖ్యమైన విషయం ఏంటంటే పిల్లలు వాష్ రూమ్లు మరియు కిచెన్ రూమ్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు, కన్స్ట్రక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇవన్నీ



వచ్చినటువంటి అధికారి గారు రాసుకుని స్కూల్ విషయంలో తన సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారి అయిన రాజవోమ్మంగి ఎం.ఈ.ఓ గారైన కె.వి.వి సత్యనారాయణ దొరగారు ,స్కూల్ హెచ్ఎం అయినటువంటి అబ్బులు గారు అలాగే స్కూల్లో పనిచేసే వాలంటరీలు , గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది....

## వైష్ణవి హై స్కూల్లో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**సామాన్యుడి అస్త్రం జనగామ** చైర్మన్ శ్రీధర్, శ్రీ విధ్య మార్గదర్శకంలో జనగాం పట్టణంలోని వైష్ణవి హై స్కూల్లో ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు చెందిన హేమలత, పవిత్ర మరియు అశోక్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పిల్లల హక్కులు, భద్రత, మంచి విలువలు, భవిష్యత్తులో లక్ష్య సాధన వంటి అంశాలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, అతిథులు అందించిన సూచనలను శ్రద్ధగా వినడం జరిగింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బాధ్యతాభావం పెంపొందించడంలో ఎంతో దోహదపడిందని పాఠశాల యాజమాన్యం తెలిపారు.




## ఉత్తమ మేకప్ ఆర్టిస్టు గా రాంపల్లి మౌనిక

జనగామ యువతుల ప్రతిభకు నిదర్శనం

**సామాన్యుడి అస్త్రం జనగామ** దర్శకుడు సతీష్ అడ్డాల ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన మిస్ ఆంధ్రప్రదేశ్ అందాల పోటీలో జనగామ జిల్లా యువతులు తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన రాంపల్లి మౌనిక, మోనికాస్ మేకోవర్స్ స్టూడియో నిర్వాహకురాలిగా తన ప్రొఫెషనల్ నైపుణ్యాన్ని చాటుతూ, మొత్తం 75 మంది మేకప్ ఆర్టిస్టులు పాల్గొన్న బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ విభాగంలో ప్రతిభ కనబర్చి ఫస్ట్ రన్నర్అప్గా నిలిచి ప్రశంసలు అందుకున్నారు మౌనిక ఆమె కృషి, అంకితభావం ఈ విజయానికి నిదర్శనంగా నిలిచాయి. అదే మౌనిక మేకోవర్స్ స్టూడియో ద్వారా శిక్షణ, మేకప్ సహకారం పొందిన జనగామ జిల్లా యువ మోడల్ పవని పగిడిపెల్లి, ఆంధ్రప్రదేశ్ అందాల పోటీలలో పాల్గొని తన అందం, అభినయం, వేదికపై ప్రదర్శనతో ఆకట్టుకుని ట్రెడిషనల్ ఐకాన్" అనే సబ్టైటిల్ను కైవసం చేసుకున్నారు మౌనిక మేకోవర్స్ ద్వారా లభించిన ప్రొఫెషనల్ మార్గదర్శకత్వమే పవని ఈ స్థాయికి ఎదగడానికి దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. జనగామ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వేదికపై ఈ విజయాలు సాధించడం గర్వకారణమని పలువురు అభినందించారు.




## జనగామ అమ్మ క్యాంటీన్

**సామాన్యుడి అస్త్రం జనగామ** బెదరకోట లక్ష్మీనారాయణ జ్ఞాపకార్ధం కుమారుడు కోడలు రాము సౌమ్య జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఘనంగా తమ తండ్రిని స్మరించుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ ఈరోజు మహా అన్న సమర్పణ కార్యక్రమం నిర్వహించిన బెదరకోట రాము సౌమ్య కి ధన్యవాదాలు తెలియజేశారు ప్రతి ఒక్కరు సందర్భం ఏదైనా కానీ భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి అని మీ మీ గ్రామస్థాయి పట్టణస్థాయిలో ప్రజలు యువత ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, పండుగ నరేష్ బింగి నరసింహులు, ఎండి అఫ్రోజ్, కొయ్యడ విశ్వ, స్వామి తదితరులు పాల్గొన్నారు



## వికసిత్ భారత్ జీ రాం జీ పథకం గ్రామాలకు వరం

**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొస్తున్న వికసిత్ భారత్ జీ రాం జీ 2025 పథకం గ్రామీణాభివృద్ధికి కీలకంగా నిలవనుందని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో పేరుకుపోయిన అనేక సమస్యలకు పరిష్కారం లభించడమే కాకుండా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆర్థికంగా గ్రామాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న ఉపాధి హామీ పథకంలో ఉన్న విధానపరమైన లోపాలను సవరించి వాటికి పరిష్కారంగా జీ రాం జీ 2025 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం అభినందనీయమని సర్పంచ్ తెలిపారు. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో వంద పని దినాలకే పరిమితమైన అవకాశాన్ని నూతన పథకం ద్వారా 125 పని దినాలుగా పెంచడంతో పాటు వేతనాలను కూడా పెంచడం గ్రామీణ కార్మికులకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఇది గ్రామీణ నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించే దిశగా కీలక అడుగుగా అభివర్ణించారు. అలాగే ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఉండటం మరింత శుభపరిణామమని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఉపాధి హామీ నిధులను సక్రమంగా పర్యవేక్షించకపోవడం సరైన వినియోగం జరగకపోవడం వల్ల నిధుల దుర్వినియోగం జరిగిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం నూతన పథకంలో 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై బాధ్యత పెరుగుతుందని దాంతో పనుల్లో పారదర్శకత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో చోటుచేసుకున్న లోపాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ కొత్త విధానం ఉపయోగపడుతుందని ప్రజలకు కేటాయించిన నిధులు నిజంగా ప్రజలకే ఉపయోగపడేలా వినియోగం జరిగే అవకాశం ఉందన్నారు. మొత్తంగా వికసిత్ భారత్ జీ రాం జీ పథకం ద్వారా గ్రామాలకు సమగ్ర అభివృద్ధి జరిగే అవకాశముందని ప్రజలకు నేరుగా మేలు చేకూరుతుందని సర్పంచ్ పబ్బు సతీష్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి అధికార ప్రతినిధి తుమ్మ శోభన్ బాబు, నాయకులు మార్క అశోక్, కీర్తిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు




## శామీర్ పేట్ గ్రామ సర్పంచ్ కి జనగామ జేఏసీ సన్మానం




**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా శామీర్ పేట్ గ్రామ సర్పంచ్ గా నూతనగా గెలుపొందిన సర్పంచ్ వనితా మహేందర్ కి జనగామ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం శామీర్ పేట్ గ్రామ జెడ్పీ హెచ్ ఎస్ పాఠశాలలో జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, ప్రదాన కార్యదర్శి తుంగ కౌశిక్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దంపతులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేందర్, ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మాధవీలత గారు, పాఠశాల హెచ్ ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ మెరుపు దాడులు



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** గంటల తరబడి సోదాలు.. కీలక ఫైళ్ల పరిశీలన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలపై ప్రత్యేక దృష్టి కార్యాలయం వద్ద ఉత్కంఠ.. ప్రజల్లో ఆసక్తి జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఒక్కసారిగా మెరుపు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల్లో అవినీతి కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో పట్టణంలో తీవ్ర కలకలం రేగింది. ఏసీబీ అధికారులు కార్యాలయానికి చేరుకున్న వెంటనే ప్రధాన ద్వారాలకు తాళాలు వేసి, లోపల ఉన్న సిబ్బందిని బయటకు వెళ్లనివ్వకుండా, బయటివారిని లోపలికి రానివ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కార్యాలయ పరిసరాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని సోదాలు ప్రారంభించారు. దాదాపు గంటల తరబడి కొనసాగుతున్న ఈ తనిఖీల్లో మున్సిపల్ కార్యాలయంలోని కీలక ఫైళ్లను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, అభివృద్ధి పనుల వ్యయాలకు సంబంధించిన రికార్డులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పలు పనుల్లో అక్రమాలు, నిబంధనలకు విరుద్ధమైన చెల్లింపులు జరిగినట్టు వచ్చిన సమాచారం మేరకు సంబంధిత పత్రాలను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో కొందరు అధికారులు లేదా సిబ్బంది లంచం తీసుకుంటూ దొరికినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఏసీబీ అధికారులు ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. సోదాలు పూర్తయ్యాక మాత్రమే పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. ఏసీబీ దాడుల విషయం తెలియగానే మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. లోపల ఏం జరుగుతుందో తెలియక సిబ్బందితో పాటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. కార్యాలయ పరిసరాలు పోలీసుల పర్యవేక్షణలో ఉండగా, పరిస్థితిని అదుపులో ఉంచేందుకు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సోదాలు ముగిసిన అనంతరం ఏసీబీ ఉన్నతాధికారులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు

# గజ్వేల్ ఎమ్మెల్యేగా... కెసిఆర్ ఉండడం ఇక్కడి ప్రజల దురదృష్టకరం

ప్రజల సొమ్ము అప్పనంగా మేస్తున్న గులాబీ అధిపతి కేసీఆర్

ముంపు బాధితులు, గజ్వేల్ ప్రజల సమస్యలు గాలికి వదలడం సిగ్గుచేటు

క్యాబినెట్ హోదా పొందుతున్న కేసీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్ :** ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉండడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టకరం కాగా, సమస్యలను గాలికి వదిలి ప్రజల సొమ్మును అప్పనంగా మేస్తున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులు, గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో పట్టికలో సంతకం పెట్టి వెళ్లిపోవడం సిగ్గుచేటని నిలదీశారు. కేవలం ప్రభుత్వ సదుపాయాలు, ప్రజల సొమ్మును ఎంజాయ్ చేస్తున్న ఆయన ఒక్క నిమిషం కూడా ఎమ్మెల్యేగా కొనసాగే నైతిక హక్కు లేదని విమర్శించారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ నిర్వాసితుల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించాల్సిన ఆయన అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వారిని అరిగోస పెడుతున్నట్లు చెప్పారు. పేద ప్రజల



లక్షల కోట్లు దండుకున్న కేసీఆర్ కుటుంబం ఇప్పటికే విచ్ఛిన్నం కాగా, పేదల ఉసురు ఊరికే పోదని ఎద్దేవా చేశారు. ముంపు బాధితులకు అరచేతిలో వైకుంఠం చూపిన కేసీఆర్, హరీష్ రావు, అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డిలకు వారి ఉసురు తప్పకుండా తగులు తుందని స్పష్టం చేశారు. కేబినెట్ మంత్రి హోదాలో, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ గజ్వేల్ నియోజక వర్గానికి నయా పైసా సాధించకపోవడం ప్రజలు చేసుకున్న పాపమని, దమ్ముంటే ఇక్కడి బిఆర్ఎస్ నేతలు ఫాంహౌజు వెళ్లి కేసీఆర్ ను నిలదీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, నేతలు సమీర్, ఉడేం శ్రీనివాస్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, జహంగీర్, భాస్కర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన డాక్టర్ పురుషోత్తం, మణికాంత్ ఏర్పుల

గ్రామ సమస్యల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తా..

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** తాను కష్ట జీతంలో నలుగురికి అండగా ఉండాలనే లక్ష్యంగా పెట్టుకుని విద్యార్థులకు, గ్రామ సమస్యల్లో తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాడు గ్రామీణ వైద్యుడు పురుషోత్తం.సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికి ఖల్సా గ్రామంలో ప్రజలకు వైద్యుడిగా డాక్టర్ పురుషోత్తం సేవలందిస్తున్నారు. అయితే గ్రామంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్ళేందుకు సైకిల్ లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని 25 సైకిలను అందజేసి అండగా నిలిచారు డాక్టర్ పురుషోత్తం.. అయితే మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల నీటి కొరత సమస్యను గుర్చి తెలుసుకుని నేడు విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు గాను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయించి స్తానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు వైద్యుడు పురుషోత్తం. నలుగురు కి కష్టాల్లో తను పాలుపంచుకోవడం సంతోషాన్నిస్తుందన్నారు ఆయన.



గ్రామంలోని సమస్యలను గూర్చి తెలుసుకుని ఇలా డాక్టర్ అండగా ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు తునికి ఖల్సా విద్యార్థులు,గ్రామస్తులు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండగళ్ల గణేష్ , ఉపసర్పంచ్ గంగుమల్ల లక్ష్మి కొండల్ రెడ్డి , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి గౌడ్ మాజీ సర్పంచ్ జానీ మాజీ ఉపసర్పంచ్ రామ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు గుడ్ల భరత్ గౌడ్, గుండమైన మహేష్, ముత్తా మహేష్, నాయకులు శ్రీరామ్ నరసింహులు జెల్ల మల్లేశం, శ్రీరామ్ సంతు, చీర్ల శ్రీహరి, మరియు యూనియన్ బ్యాంక్ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు..

# సిరిసేడు ప్రభుత్వ పాఠశాలకు మత సౌజన్యంతో ఆధునిక బాత్రూమ్స్

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మిన్నెసోటా ఏరియా తెలంగాణ అసోసియేషన్ (మాటా) అందిస్తున్న సహకారం అభినందనీయం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మాటా సౌజన్యంతో రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక బాత్రూమ్లను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కటంగూరి అంజలిదేవి, గ్రామ సర్పంచ్ శ్యామల కుమార్, మండల విద్యాశాఖాధికారి (వీజూా) రాములు నాయక్ పాల్గొని బాత్రూమ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటా ప్రతినిధి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా మాటా సంస్థ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. మాటా సహకారంతో చేపట్టిన బాత్రూమ్ల నిర్మాణ పనులను ఎంతో శ్రద్ధతో దగ్గరుండి పర్యవేక్షించి




పూర్తి చేయించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, ప్రభాకర్ రెడ్డి, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ రామకృష్ణలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బొమ్మిడి తిరుపతి, చింటూ, రాజయ్య, రేణుకుంట్ల రాములు, ఎజ్జు శ్రీను, కార్యదర్శి శ్రీనివాస్, గొట్టే శేఖర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మాటా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కటంగూరి విక్రాంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారుంంం

# ఇద్దరు సీఎంలకు రమణారెడ్డి క్లాస్



**హైదరాబాద్ :** రాజకీయాల్లో విమర్శ ఉండాలి, కానీ విద్వేషం ఉండకూడదు. వాదన ఉండాలి, కానీ వేదన కలిగించే భాష ఉండకూడదు. దురదృష్టవశాత్తూ, గత కొన్నేళ్లుగా తెలంగాణ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. "ఎవరు ఎంత గట్టిగా తిడితే, అంత గొప్ప నాయకుడు" అనే కొత్త, ప్రమాదకరమైన నిర్వచనం తెరపైకి వచ్చింది. సరిగ్గా ఇటువంటి సమయంలో, తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆత్మవిమర్శకు తెరలేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మైంది. ఒకవైపు అప్పటి సీఎం కేసీఆర్, మరోవైపు అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి.. ఇద్దరు హేమా హేమీలు బరిలో నిలిచారు. ఆ ఇద్దరినీ మట్టికరిపించి, 'జెయింట్ కిల్లర్'గా అసెంబ్లీలో అడుగుపెట్టారు వెంకటరమణారెడ్డి. ఆశ్చర్యకరం గా, ఇప్పుడు ఆ ఇద్దరు నేతలు పాటిస్తున్న లేదా ప్రోత్సహిస్తున్న దూషణల పర్వంపైనే ఆయన మొట్టమొదటి సారిగా గళం విప్పారు. సామాన్య ఎమ్మెల్యేగా కాకుండా, ప్రజల నాడిని పర్ఫెక్ట్‌గా పట్టుకున్న నాయకుడిగా ఆయన అసెంబ్లీ సాక్షిగా పీకిన క్లాస్ ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. అసెంబ్లీలో వెంకటరమణారెడ్డి వాడిన పదాలు చాలా పదునుగా ఉన్నాయి. "హైదరాబాద్ నగరాన్ని మనం వన్ క్లాస్ సిటీ అని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ మనం మాట్లాడే మాటలు మాత్రం థర్డ్ క్లాస్‌కు పడిపోతున్నాయి" అని ఆయన చేసిన వ్యాఖ్య సిగ్గుపడేలా చేసింది. అభివృద్ధిలో పోటీ పడాల్సిన నాయకులు, బూతుల్లో పోటీ పడుతుండటం వల్ల సమాజంలో రాజకీయ నాయకులపై గౌరవం తగ్గిపోతోందన్న ఆయన ఆవేదనలో వంద శాతం నిజముంది. ముఖ్యంగా, "ఒకరు మనల్ని తిట్టినప్పుడు, మనం అంతకంటే రెండు మాటలు ఎక్కువ తిడితే జనం మెచ్చుకుంటారని అనుకోవడం మూర్ఖత్వం" అని ఆయన తేల్చి చెప్పారు. ఇది కేవలం అధికార పక్షానికో, ప్రతిపక్షానికో పరిమితం కాదు.. అందరికీ వర్తించే సార్వజనీన సత్యం. రాజకీయ నాయకులు తమను తాము గౌరవించుకోనప్పుడు, ఇతరులు తమను ఎందుకు గౌరవిస్తారు? అనే ప్రాథమిక ప్రశ్నను ఆయన లేవనెత్తారు. ప్రధానమంత్రి మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ వంటి వారిని మీడియా ప్రతినిధులు ఏకవచనంతో సంబోధించడాన్ని ఆయన తప్పుబట్టారు. అయితే, దానికి కారణం మీడియా కాదని, రాజకీయ నాయకులు ఒకరినొకరు పిలుచుకుంటున్న విధానమేనని ఆయన విశ్లేషించడం గమనార్హం. "మనమే బూతులు తిట్టుకుంటూ, మీడియా వాళ్లు మనల్ని క్లాస్‌మేట్స్ లాగా ట్రీట్ చేస్తున్నారు" అనడం ద్వారా.. వ్యవస్థలో లోపం ఎక్కడుందో ఆయన వేలు పెట్టి చూపించారుఈసారి తెలంగాణ అసెంబ్లీకి దాదాపు 57 మంది కొత్త ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వీరంతా సీనియర్లను చూసి నేర్చుకోవాలి. కానీ, సభలో సీనియర్లు ప్రదర్శిస్తున్న ప్రవర్తన, వాడుతున్న భాష కొత్తవారిని తప్పుదోవ పట్టించేలా ఉందని వెంకటరమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సభలో హుందాతనం, సంప్రదాయాలు, పరస్పర గౌరవం ఉండాలని.. ఒకరు మూర్ఖంగా మాట్లాడితే, మరొకరు సద్విమర్శతో సరిచేయాలే తప్ప, అంతకంటే దిగజారిపోకూడదని ఆయన హితవు పలికారు. సభలో వెంకటరమణారెడ్డి లేవనెత్తిన ఆవేదనతో మంత్రి శ్రీధర్ బాబు ఏకీభవించడం స్వాగతించదగ్గ పరిణామం. అయితే, ఇది కేవలం మాటలకే పరిమితం కాకూడదు. తిట్టడమే రాజకీయం అనే భావన నుంచి ప్రశ్నించడమే రాజకీయం అనే స్థాయికి మన ప్రజాస్వామ్యం ఎదగాలి. కామారెడ్డి ప్రజలు ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించి వెంకటరమణారెడ్డిని గెలిపించింది బహుశా.. ఇలాంటి నిష్ఠూర సత్యాలు చెప్పడానికేనేమో! ఆయన మాటలు ఎంతమంది చెవికెక్కుతాయో కాలమే నిర్ణయించాలి. కానీ, రాజకీయాల్లో పడిపోతున్న విలువలను కాపాడటానికి ఒక ప్రయత్నం మాత్రం జరిగింది.

## ఇవాళ నిఘా వ్యవస్థ లేదా..
## ఫోన్ ట్యాపింగ్ నడుస్తలేదా..

**ఫోన్ ట్యాపింగ్‌పై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రికి ఇంటెలిజెన్స్ వస్తుందని తెలిపారు. గూఢచారి వ్యవస్థ తొలి ప్రధాని నెహ్రూ నుంచి నేటిదాకా ఉందని గుర్తుచేశారు. శాంతి భద్రతలు, రాష్ట్ర రక్షణ కోసం ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. ఇవాళ నిఘా వ్యవస్థ లేదా.. ఫోన్ ట్యాపింగ్ నడుస్తలేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం లేదా అని ప్రశ్నించారు. ట్యాపింగ్ నిజమైతే అధికారులు ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టడం లేదని అడిగారు. ఇప్పుడు డీజీపీ కూడా అప్పుడు అధికారిగా ఉన్నారని గుర్తుచేశారు. ఆయనకు కూడా నిఘా వ్యవస్థ గురించి అన్ని తెలుసని చెప్పారు. నిఘా వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తుందో ముఖ్యమంత్రికి అధికారులు చెప్పరని అన్నారు. వారికి ఉన్న నిబంధనల మేరకు, వారికి సమాచారం ఏవిధంగా వస్తుందో ముఖ్యమంత్రి అడగరని చెప్పారు. ఈ సిట్ వంటి డ్రామాలతో ప్రజల దృష్టిని ఎన్నిరోజులు మరలుస్తారని ప్రశ్నించారు. ఈ అటెన్షన్ డైవర్షన్‌తో ఎన్నిరోజులు కాలం వెల్లదీస్తారని నిలదీశారు. ఇన్నిరోజులు సిట్, విచారణ, కేసుల పేరుతో సాధించిందేంటని ప్రశ్నించారు. కనీసం ఒక్క దాంట్లో అయినా నిజం తెలిసిందా అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్లను ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. అందుకే ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేశారని అన్నారు. కాంగ్రెస్‌కు పరిపాలన రాదని ప్రజలకు తెలిసిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ అప్పుల ప్రచారాన్ని కూడా ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. కాగ్ లెక్కల నిజాలు కూడా ప్రజలకు తెలుసని అన్నారు. 24 నెలల్లో చేసిన రెండున్నర లక్షల కోట్ల అప్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీ చర్చ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎవరు ఏ ప్రాజెక్టులు కట్టినా తాగునీటి అవసరాల పేరుతోనే ప్రాజెక్టులు కట్టడం ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తర్వాతనే అన్ని అనుమతులు తీసుకురావడం ఆనవాయితీ అని, కానీ ఈ విషయాన్ని ఎవరూ చెప్పరని వివరించారు. పోలవరం ప్రాజెక్టు గురించి 70 ఏండ్లుగా వింటున్నాం.. కానీ ఇంకా అది పూర్తి కాలేదని అన్నారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ హయాంలోనే పూర్తయ్యిందని తెలిపారు. దీనికి కేసీఆర్ నిబద్ధతనే కారణమని స్పష్టం చేశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారు

**పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయి: కేటీఆర్**

**హైదరాబాద్ :** అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 40 శాతం ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు.

## హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు?
## ప్రశ్నించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ :** ఇరిగేషన్ లో తానే మాస్టర్ అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అనుకుంటున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హరీష్ రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. హరీష్ రావు పై ఉత్తమ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు.. హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు? అని.. ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలు బయటపెడతామని, పాత జీవో కాపీలను మీడియాకు చూపెడతామని తెలియజేశారు. కృష్ణా జలాల్లో తాము 90టిఎంసిలు డిమాండ్ చేశామని, తాము 45 టిఎంసిలు అడిగామని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీదే బిఆర్ఎస్ బతుకుతోందని, తెలంగాణకు అన్యాయం జరిగేలా తాను ఎందుకు లేఖ రాస్తానని ఉత్తమ్ ప్రశ్నించారు. సిడబ్ల్యూసికి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని, కృష్ణా బేసిన్ పై అసెంబ్లీ ప్రజెంటేషన్ కు తాము సిద్ధమని సవాల్ విసిరారు. మేడిగడ్డ మరమ్మతులపై ఎల్అండ్ టికి నోటీసులిచ్చామని, మేడిగడ్డలో పలు పరీక్షలు, ఇతర తనిఖీలకు ఎల్అండ్ టి ఒప్పుకుందని పేర్కొన్నారు. త్వరలోనే మేడిగడ్డ పనులు మొదలవుతాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## బంగ్లాదేశ్ లో హిందూవులపై దాడులు
## తెలంగాణ న్యాయవాదుల నిరసన

**హైదరాబాద్ :** బంగ్లాదేశ్లో అమాయక హిందువులపై జరుగుతున్న అమానుష దాడులు, చిత్రహింసలు, ప్రాణహానిని నిరసిస్తూ తెలంగాణ హైకోర్టు జాతీయవాద న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు,, బంగ్లాదేశ్లో అమాయక హిందువులపై విచక్షణారహితంగా దాడులు చేస్తూ, చిత్రహింసలకు గురిచేసి మానవ ప్రాణాలను హరిస్తున్న మతాంధత్వం మరియు చాందసవాద విధానాలను తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగ్లాదేశ్లో కొనసాగుతున్న ఈ మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాదులు ఐక్యరాజ్య సమితిని డిమాండ్ చేశారు., మతాంధత్వంతో రెచ్చిపోతున్న ఈ హింసాకాండపై ఐక్యరాజ్య సమితి తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## దానం బంపర్ ఆఫర్



**హైదరాబాద్ :** సంక్రాంతి పండుగ వేళ పతంగుల సందడి మొదలైంది. ఈ తరుణంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రాణాంతకమైన చైనా మాంజా వినియోగాన్ని అరికట్టేందుకు ఆయన ఒక వినూత్నమైన ఆఫర్‌ను ప్రకటించారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిస్తే తన సొంత నిధుల నుండి రూ.5,000 నగదు బహుమతి ఇస్తానని వెల్లడించారు. చైనా మాంజా కారణంగా జరుగుతున్న అనర్థాలపై దానం నాగేందర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "చైనా మాంజా కేవలం దారం కాదు.. అది ఒక మృత్యుపాశం. దీనివల్ల అమాయక పక్షులు గాలిలో ప్రాణాలు వదులుతున్నాయి. బైక్‌లపై వెళ్లే ప్రయాణికులు మెడకు తట్టుకుని తీవ్ర గాయాలపాలవుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు కూడా పోతున్నాయి" అని ఆయన అన్నారుఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా వ్యాపారులు లాభాపేక్షతో చైనా మాంజాను విక్రయిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే దానం హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి మాంజా అమ్ముతున్న షాపులపై పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయిస్తామన్నారు. సమాచారం నిజమని తేలితే వెంటనే రూ.5,000 నగదును బహుమతిగా అందజేస్తామన్నారు. వ్యాపారులతో పాటు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏ రకమైన దారాన్ని వాడుతున్నారో గమనించాలని దానం కోరారు. పర్యావరణానికి, ప్రాణాలకు హాని కలిగించే వస్తువులను బహిష్కరించి, పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి ఎంత ముఖ్యమో, ప్రజల ప్రాణరక్షణ కూడా అంతే ముఖ్యమని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర్ణయంపై పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అఖండ అద్భుతమైన సినిమా
# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ :** ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అఖండ 2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అని అన్నారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని చెప్పారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్ ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. హైదరాబాద్ లోని బంజారా హిల్స్ ప్రసాద్ ల్యాబ్స్ లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి అఖండ 2 తాండవం సినిమాను బండి సంజయ్ వీక్షించారు. బీజేప రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధి జె.సంగప్పసహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్ తో కలిసి ఈ సినిమాను చూశారు. సినిమా అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ ఏమన్నారంటే:అఖండ 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లున్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యముండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే, దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా సినిమా అఖండ తాండవం. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే..ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవాడే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడిపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలనే సినిమా అఖండ. భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం. కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే..సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే,ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన దృశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్ ను పాలిస్తున్నాడు కాబట్టే వ్యాక్సిన్ ను అందించగలిగినం. సైంటిస్టులను ప్రోత్సహించినం. కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్ లో ఉంది. మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్ ను పరీక్షించాడు. అఖండ తాండవం సినిమాను ప్రతి హిందువు, భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా. బోయపాటి శ్రీనివాస్ దర్శకత్వంలో బాలక్రిష్ణ అద్భుతంగా నటించారు. బాలయ్య సినిమాల కోసం విద్యార్థులు, కాలేజీలు, యువకులు బెట్టింగులు పెట్టి మరీ వెళుతున్నారు. ఎన్టీఆర్ రూపంలో బాలయ్యను చూస్తున్నాం. అఖండ సినిమాలో బాలయ్యను చూస్తే శివుడే మన ముందు కన్పించినట్లుంది. అఖండ సినిమాను లీనమై చూశాం. ఎక్కడా రాజీపడకుండా అఖండ 2 సినిమా చూసిన బోయపాటి శ్రీనుకు ప్రత్యేక అభినందనలు. ఈ సినిమాను అందరం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలి. ఈ దేశంలో అంతర్గతంగా జరుగుతున్న దాడులను, పరిస్థితులను ఆసరాగా చేసుకుని సినిమాలు తీసి ప్రజలను మేల్కోల్పాల్సిన అవసరం ఉంది. కొంత మంది ధర్మం విషయంలో దారి తప్పుతున్నారు. దేవుడు లేడు, హిందూ సనాతన ధర్మం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారందరికీ అఖండ 2 సినిమా గుణపాఠం. అటు ఇటు దారి తప్పిన వాళ్లంతా హిందూ ధర్మమనే గొడుగు కిందకు రావాలని కోరుతున్నా.

# నవీన్ యాదవ్ ఫస్ట్ స్పీచ్

**హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో అందరి దృష్టిని ఆకర్షించిన అంశాల్లో మెదటి ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు హాజరు కావటం అయితే.. రెండోది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఘనవిజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా సభలో అడుగుపెట్టిన నవీన్ యాదవ్ . ఎమ్మెల్యే హోదాలో తన మొట్టమొదటి ప్రసంగంతోనే నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి నవీన్ యాదవ్ తనదైన ముద్ర వేశారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. నవీన్ యాదవ్ భావోద్వేగానికి గురయ్యారు. 'నాపై నమ్మకంతో అవకాశం ఇచ్చి గెలిపించిన గౌరవ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో నా పేరును ప్రస్తావించారు. ఇప్పుడు అదే సభలో ఆయనతో పాటు తోటి సభ్యుడిగా కూర్చోవడాన్ని నా అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నాను' అని వ్యాఖ్యానించారు. సభ మర్యాదలను కాపాడుతూ.. ముఖ్యమంత్రి సూచనలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ప్రతిజ్ఞ చేశారు. కేవలం రాజకీయ కృతజ్ఞతలకు పరిమితం కాకుండా.. తన నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను నవీన్ యాదవ్ సూటిగా ప్రభుత్వం ముందుంచారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ కృష్ణానగర్ ప్రాంతం జలమయమవుతోందని.. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల సామాన్య ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జూబ్లీహిల్స్ పరిధిలోని పలు బస్తీల్లో ఇళ్లకు అతి సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగల వల్ల ఇప్పటివరకు పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లైన్లను భూగర్భ కేబుల్స్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల అవసరం ఎంతో ఉందని వెంటనే వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. కొత్త ఎమ్మెల్యే అయినప్పటికీ ఎంతో అనుభవ జ్ఞుడిలా సమస్యలపై నవీన్ యాదవ్ చేసిన ప్రసంగాన్ని తోటి సభ్యులు అభినందించారు. కాగా, సంతాప తీర్మానాలు, ప్రశ్నోత్తరాల సమయం



అనంతరం ఉభయ సభలు వాయిదా పడ్డాయి. తిరిగి జనవరి 2న సభలు ప్రారంభం కానున్నాయి.

సామాన్యుడి అస్త్రం


# రిలీజ్ ముంగిట మరో ట్రైలర్.. చూశారా?




ప్రభాస్ 'రాజాసాబ్' నుంచి మరో ట్రైలర్ వచ్చేసింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలోనే ట్రైలర్ రిలీజ్ చేస్తారేమోనని అభిమానులు ఆశపడ్డారు కానీ ఆదికాస్త ఆలస్యమైంది. ఇప్పుడు దాన్ని విడుదల చేశారు. గతంలో తీసుకొచ్చిన ట్రైలర్‌కి ఏ మాత్రం తగ్గకుండా ఇది ఉంది. ఇందులో కామెడీ, హారర్ లాంటి ఎమోషన్స్ బాగానే చూపించారు. ఈ సినిమా.. జనవరి 9న థియేటర్లలోకి రానుంది. 8వ తేదీన రాత్రి ప్రీమియర్లు కూడా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ప్రీమియర్లు, టికెట్ రేట్ల గురించి క్లారిటీ రావొచ్చు. లేదంటే మాత్రం 8వ తేదీ సెకండ్ షోల నుంచి సినిమా రిలీజ్ అవుతుంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా చేశారు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషించారు. మారుతి దర్శకుడు. తమన్ సంగీతమందించాడు.

# ట్రెండింగ్ రీల్‌తో.. పెళ్లి తేదీని ప్రకటించిన అల్లు శిరీష్

అల్లువారి ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, స్టార్ హీరో అల్లు అర్జున తమ్ముడు అల్లు శిరీష్ త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనిక తో అల్లు శిరీష్ నిశ్చితార్థం ఇటీవలే ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. దీంతో వీరి పెళ్లి గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వెడ్డింగ్ డేట్‌ను అల్లు శిరీష్ అధికారికంగా ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా ఆసక్తికర వీడియో ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అర్హ, అల్లు అయాన్‌తో కలిసి రీల్ చేస్తూ పెళ్లి తేదీని ప్రకటించారు అల్లు శిరీష్. 'బాబాయ్ పెళ్లి ఎప్పుడు..?' అని పిల్లలు అడగ్గా.. 'మార్చి 6, 2026' అని సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత 'సంగీత్ ఎప్పుడు ఉంటుంది..?' అని ప్రశ్నించగా.. 'మనం దక్షిణాదివాళ్లం.. అలాంటివి చేసుకోం' అని చెప్పారు. ఈ రీల్ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా, శిరీష్-నయనకది ప్రేమ వివాహం. వారిద్దరికీ హీరో నితిన్ భార్య ఏర్పాటు చేసిన ఫంక్షన్‌లో తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి, ఇప్పుడు పెళ్లికి దారి తీసింది. ఇరు కుటుంబ సభ్యుల అంగీకారంతో వీరు వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. అల్లు శిరీష్ చివరిసారిగా 2024లో విడుదలైన యాక్షన్-కామెడీ ఫాంటసీ చిత్రం 'బడ్డీ' లో కనిపించారు.






# పెద్ది నుండి సర్‌ప్రైజ్.. అసలు ఈ నటుడిని గుర్తు పట్టలేకపోతున్నాముగా!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నేషనల్ అవార్డు విన్నర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో అప్పలసూరి అనే కీలక పాత్ర ఫస్ట్ లుక్‌ను మేకర్స్ సోమవారం (డిసెంబర్ 29) విడుదల చేశారు. అయితే ఈ పోస్టర్ చూసిన అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పోస్టర్‌లో కనిపిస్తున్న వ్యక్తి ఎవరో గుర్తుపట్టలేక చాలా మంది ఫ్యాన్స్ ముక్కున వేలేసుకున్నారు. తర్వాత అది జగపతి బాబు అని తెలిసి ఆశ్చర్యానికి లోనయ్యారు. స్టైలిష్, పవర్‌ఫుల్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న జగపతి బాబు, ఈసారి మాత్రం పూర్తిగా భిన్నమైన అవతారంలో దర్శనమివ్వబోతున్నారు. 'పెద్ది' సినిమాలో అప్పలసూరి పాత్ర కోసం జగపతి బాబు పూర్తిగా తన రూపాన్ని మార్చుకున్నట్లు ఈ ఫస్ట్ లుక్ స్పష్టంగా చెబుతోంది. గడ్డం, రఫ్ లుక్, కళ్లలో కనిపించే ఇంటెన్సిటీతో ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో అర్థమవుతోంది. ఈ మధ్య కాలంలో తనకు సరిపోయే బలమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జగపతి బాబు, ఈ సినిమాలో మరో మాస్టర్‌క్లాస్ పర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నాడని టాక్. ఈ ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ 'పెద్ది' మూవీ టీమ్ తమ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్‌లో పెద్దిలో అప్పలసూరిగా అద్భుతమైన జగపతి బాబు. ఓ బలమైన, ప్రభావవంతమైన పాత్రలో అతని మాస్టర్‌క్లాస్ పర్ఫార్మెన్స్ చూడటానికి సిద్ధంగా ఉండండి. పెద్ది మార్చి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది అని ట్వీట్ చేసింది. ఈ పోస్టర్‌ను రామ్ చరణ్ కూడా తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేస్తూ ప్రశంసలు కురిపించారు. "స్క్రీన్‌కు అతడు తీసుకొచ్చే ఇంటెన్సిటీ మరెవరి వల్లా సాధ్యం కాదు. జగపతి బాబు గారిని పెద్దిలో అప్పలసూరిగా చూడటం చాలా సంతోషంగా ఉంది" అని ట్వీట్ చేశారు. రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు లెజెండరీ కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

## స్పోర్ట్స్

# న్యూజిలాండ్ సిరీస్‌కు ముందే 'మరోసారి' రంగంలోకి దిగనున్న విరాట్ కోహ్లి

టీమిండియా దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి న్యూజిలాండ్ సిరీస్‌కు ముందే మరోసారి రంగంలోకి దిగనున్నాడు. ఇటీవలే విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడిన విరాట్, ఇదే టోర్నీలో మరో మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. జనవరి 6న ఆలుర్‌లో రైల్వేస్‌తో జరుగబోయే మ్యాచ్‌లో విరాట్ బరిలో ఉంటాడని ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ అత్యున్నత అధికారి ఒకరు క్రిక్‌బజ్‌కు లీక్ ఇచ్చారు. ఈ మ్యాచ్ ముగిసిన వెంటనే విరాట్ న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం జనవరి 7న భారత జట్టుతో పాటు బరోడాలో కలుస్తాడు. భారత్, న్యూజిలాండ్ మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జనవరి 11 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం భారత జట్టును అతి త్వరలో ప్రకటిస్తారు. ఈ జట్టులో విరాట్ ఉండటం లాంఛనమే. టీ20, టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఫార్మాట్‌లో విరాట్ ప్రస్తుతం అత్యుత్త మ ఫామ్‌లో ఉన్నాడు. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో 3 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు చేసి పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడిన విరాట్.. ఓ సెంచరీ (ఆంధ్రపై 131), ఓ హాఫ్ సెంచరీ (గుజరాత్‌పై 77) చేశాడు. విరాట్ రైల్వేస్‌తో జరుగబోయే మ్యాచ్‌లోనూ సత్తా చాటితే న్యూజిలాండ్ సిరీస్‌కు ముందు టీమిండియాకు అదనపు ధైర్యం వస్తుంది. విరాట్ తాజాగా సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు (135, 102), ఓ హాఫ్ సెంచరీ (65 నాటౌట్) చేశాడు. అంతకుముందు ఆస్ట్రేలియా పర్యటనలో తొలి రెండు మ్యాచ్‌ల్లో డకౌటైన విరాట్.. చివరి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ (74 నాటౌట్) చేసి ఫామ్‌లోకి వచ్చాడు. విరాట్ ఢిల్లీ జట్టులో ఉండటం వల్ల విజయ్ హజారే ట్రోఫీలో ఆ జట్టుకు కూడా అదనపు బలం చేకూరుతుంది.



# ఆస్ట్రేలియా బ్యాటర్ విధ్వంసం.. టీ20ల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ!



మహిళల టీ20 క్రికెట్‌లో మరో వేగవంతమైన అర్ధసెంచరీ నమోదైంది. ఆస్ట్రేలియాకు చెందిన లౌరా హారిస్ న్యూజిలాండ్‌లో జరుగుతున్న టి20 లీగ్‌లో ఈ ఘనత సాధించింది. కేవలం 15 బంతుల్లో ఆమె ఫిఫ్టీ బాదింది. కివీస్ లీగ్ టోర్నీ ఉమెన్ సూపర్ స్మాష్ (డబ్ల్యూఎస్ఎస్)లో ఒటాగో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె ఆదివారం కాంటర్‌బరీతో జరిగిన మ్యాచ్‌లో చెలరేగింది. అలెగ్జాండ్రాలోని మోలినెక్స్ పార్క్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో లౌరా (15 బంతుల్లో 52బీ 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచేసింది. తద్వారా 2022లో వార్విక్‌షైర్ తరఫున మేరి కెల్లీ చేసిన (15 బంతుల్లో ఫిఫ్టీ) రికార్డును సమం చేసింది. లౌరా వీరబాదుడుతో 146 పరుగుల లక్ష్యాన్ని 15వ ఓవర్లోనే ఛేదించిన ఒటాగో ఈ మ్యాచ్‌లో బోనస్ పాయింట్‌తో గెలిచింది. ఈ సీజన్ మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో నిరాశపరిచిన లౌరా.. న్యూజిలాండ్‌లో మెరుపులు మెరిపించింది. అయితే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ ఆమెకిదే మొదటిది కాదు. ఓవరాల్ టి20 లీగ్‌లలోనే ఆరుసార్లు 50 పైచిలుకు (ఫిఫ్టీలు) పరుగులు చకచకా చేసిన ఘనత ఆమెకు ఒక్కరికే దక్కుతుంది. మూడుసార్లు 18 బంతుల్లో, ఒకసారి 19 బంతుల్లో, ఇంకోసారి 17 బంతుల్లో, ఇప్పుడేమో 15 బంతుల్లో ధనాధన్ అర్ధశతకాల్ని బాదింది. ప్రత్యేకించి మహిళల టి20 క్రికెట్, లీగ్‌లలో ఆమె తప్ప ఇంకెవరూ ఒకసారి మించి వేగవంతమైన అర్ధసెంచరీల్ని బాదలేకపోయారు.

# టీ20ల్లో అరుదైన రికార్డు.. 8 వికెట్లు తీసుకున్న భూటాన్ స్పిన్నర్

**న్యూఢిల్లీ:** భూటాన్ స్పిన్ బౌలర్ సోనమ్ యేషే చరిత్ర సృష్టించాడు. టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో 8 వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. భూటాన్‌లోని గెలపు సిటీలో మయన్మార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. డిసెంబర్ 26వ తేదీన ఈ మ్యాచ్ జరిగినట్లు తెలుస్తోంది. 22 ఏళ్ల ఆ బౌలర్ ఏడు పరుగులు ఇచ్చి ఎనిమిది వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భూటాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 రన్స్ చేసింది. అయితే టార్గెట్ చేస్తున్న సమయంలో మయన్మార్ జట్టు కేవలం 45 రన్స్‌కే ఆలౌటైంది. భూటాన్ క్రికెట్ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో ఈ అంశాన్ని పోస్టు చేసింది. సోనమ్ యేషే అసాధారణ రికార్డు నెలకొల్పాడని, 7 పరుగులు ఇచ్చి8 వికెట్లు తీసుకున్నాడని, ఇది వరల్డ్ రికార్డు అని, ఇది ఎంతో అరుదైన ఘటన అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో కానీ, ఇతర టోర్నీల్లో కానీ 8 వికెట్లు తీసుకున్న బౌలర్ లేరు. గతంలో మలేషియా పేస్ బౌలర్ సజ్రుల్ ఇద్రస్ 8 పరుగులు ఇచ్చి ఏడు వికెట్లు తీసుకున్నారు. 2023లో చైనాతో జరిగిన మ్యాచ్‌లో ఆ ఘనత సాధించారు.



PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.